ఏడాది పాలన

ప్రగతి బాటలో తొలి అడుగు

ఐదేళ్ల అధోగతిలోంచి జిల్లా కోలుకుంటోంది. వైసీపీ అరాచక పాలనలో సకల రంగాలూ జిల్లాలో చతికిలపడ్డాయి.ఇసుక, గ్రావెల్, క్వారీల కొల్లగొట్టుడు పనుల్లో మునిగిపోయిన వైసీపీ నేతలు జిల్లా యువత భవిష్యత్తును గాలికొదిలేశారు. కొత్త పరిశ్రమల కోసం ప్రయత్నం కూడా లేదు. పంపకాల పథకాల గొప్పలు చెప్పి అభివృద్ధిని అటకెక్కించేశారు. వ్యవసాయ పథకాలు నిలిపేశారు. ఏనుగులతో సతమతమవుతున్న జనానికి భరోసా ఇవ్వలేదు. ఏడాది కిందట సరిగ్గా ఈరోజు.. జూన్ 12న చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం బాధ్యతలు తీసుకున్నాక జిల్లా అభివృద్ధి చిత్రపటం రూపు మారడం మొదలైంది. జగన్ జమానాలో గతుకులమయమైన రోడ్లకు కొత్త ప్రభుత్వం అతుకులు వేయాల్సివచ్చింది. గ్రామీణ రోడ్ల నిర్మాణం పెద్దఎత్తున ప్రారంభం అయ్యింది. జిల్లా ప్రజలకు నమ్మకమిచ్చేలా సాగిన ఏడాది పాలన విశేషాలు..

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

రహదారులకే రూ.222 కోట్లు

వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో కొత్త రోడ్ల మంజూరు విషయం పక్కన పెడితే పాతరోడ్ల నిర్వహణ, మరమ్మతులను కూడా పట్టించుకోలేదు. దీంతో కూటమి ప్రభుత్వం ఏర్పడేనాటికి జిల్లాలో రోడ్లన్నీ ఛిద్రమైపోయి ఉన్నాయి. రూ.22 కోట్లతో వాటన్నింటికీ మరమ్మతులు చేయించారు.

- రూ.22 కోట్లతో రహదారులకు మరమ్మతులు
- రూ.6 కోట్లతో చిత్తూరు- గుడియాత్తం రోడ్డు అభివృద్ధి
- రూ.2.35 కోట్లతో చిత్తూరు- గుడిపాల రోడ్డు అభివృద్ధి
- ఉపాధి హామీ నిధులు రూ.90 కోట్లతో సీసీ రోడ్లు, రూ.30 కోట్లతో బీటీ రోడ్లు పూర్తి.
- రూ.4 కోట్లతో చిత్తూరు ఫారెస్టు రోడ్డు అభివృద్ధి
- రూ.15 కోట్ల ఉపాధి గ్రాంట్లతో పీఆర్ రోడ్లకు టెండర్లు
- రూ.53 కోట్ల ప్రత్యేక నిధులతో కుప్పం నియోజకవర్గంలో 23 రహదారుల అభివృద్ధి

నాడు - నేడు



చిత్తూరు- గుడియాత్తం రోడ్డులో మంగళపల్లె వద్ద



ఉద్యాన ప్రోత్సాహం పునరుద్ధరణ

ఉద్యాన పంటల్ని సాగు చేసుకునే రైతులు వైసీపీ ప్రభుత్వ హయాంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యారు. కూటమి ప్రభుత్వం వస్తూనే రూ.20 కోట్లతో ఫార్మ్‌పాండ్స్, షెడ్ల నిర్మాణంలో, సాగులో 60 శాతం రాయితీ ఇచ్చింది. ఈ ఏడాది 5 వేల ఎకరాలకుపైగా ఉద్యాన పంటల సాగును పెంచింది.

డ్రిప్ ఇరిగేషన్‌కు రూ.వంద కోట్లు

సీఎం చంద్రబాబు ప్రతిష్ఠాత్మకంగా చెప్పుకునే డ్రిప్ ఇరిగేషన్ విధానాన్ని మళ్లీ పునరుద్ధరించారు. ఈ ఏడాదిలో 10 వేల హెక్టార్లలో డ్రిప్ ఇరిగేషన్ విధానం ద్వారా పంటల్ని సాగు చేశారు. ప్రభుత్వం 90 శాతం రాయితీతో రూ.వంద కోట్లను ఖర్చు చేసింది.



పెనుమూరు మండలం గంగుపల్లె వద్ద పూర్తయిన గోకులం షెడ్డు

గోకులాల కోసం రూ.45 కోట్లు

పాడి రంగాన్ని ప్రోత్సహించేలా కూటమి ప్రభుత్వం రాయితీతో గోకులం షెడ్లను నిర్మించింది.

- మంజూరైన షెడ్లు: 2134
- కేటాయించిన నిధులు: రూ.45 కోట్లు
- పూర్తయినవి: 1500

పెన్షన్లకు రూ.1502 కోట్లు

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సామాజిక పెన్షన్ల సొమ్మును రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంచింది. దీంతో పాటు అన్నిరకాల పెన్షన్లూ పెరిగాయి.

- **జిల్లాలో పెన్షన్‌దారులు:** 2.66 లక్షలు
- **నెలకు అందిస్తున్న పెన్షన్:** రూ.122 కోట్లు
- **తొలి నెల అందించింది:** రూ.160 కోట్లు
- **ఈ ఏడాది పెన్షన్లకు ఖర్చు:** రూ.1502 కోట్లు



ఉచిత సిలిండర్లకు రూ.40.53 కోట్లు

ఎన్నికల హామీ మేరకు గతేడాది నవంబరు నుంచి ఉచిత సిలిండర్ల పంపిణీ పథకానికి సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారు. ఏడాదికి మూడు సిలిండర్లు చొప్పున ఉచితంగా అందిస్తున్నారు.

- **నవంబరు 2024 నుంచి మార్చి 2025 వరకు:** 3.53 లక్షల మందికి రూ.28.57 కోట్ల సబ్సిడీ
- **ఏప్రిల్ 2025 నుంచి ఇప్పటివరకు:** 1.41 లక్షల మందికి రూ.11.96 కోట్ల సబ్సిడీ

మామిడి రైతులకు రూ.200 కోట్లతో మద్దతు

ఐదేళ్ల పాటు మామిడి రైతులు తీవ్ర సంక్షోభాన్ని అనుభవించినా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. ప్రస్తుతం రైతుల బాధను అర్థం చేసుకుని వాళ్ల రోడ్డెక్కి నిరసనలు చేయకముందే సీఎం చంద్రబాబు మద్దతు ధర రూ.12ను ప్రకటించారు. అందులో ప్రభుత్వం కిలోకు రూ.4 సబ్సిడీ అందిస్తోంది.

- జిల్లాలో తోతాపురి మామిడి సాగు: 99,738 ఎకరాలు
- సాధారణ పరిస్థితుల్లో దిగుబడి: 4 లక్షల టన్నులు
- ఈ సారి దిగుబడి అంచనా: 4.98 లక్షల టన్నులు
- రూ.4 సబ్సిడీతో ప్రభుత్వం అందించే సాయం: రూ.200 కోట్లు

హంద్రీనీవా కాలువల లైనింగ్‌కు రూ.516 కోట్లు

జిల్లాలో సాగు, తాగునీటి అవసరాలు తీర్చే ప్రతిష్ఠాత్మక హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టును వైసీపీ ఐదేళ్లూ నిర్లక్ష్యం చేసింది. ఎన్నికలకు ముందు నీళ్లు వదులుతున్నట్లు నాటకాలాడిన జగన్ నవ్వులపాలయ్యారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే పెద్దఎత్తున నిధులిచ్చి పనుల్ని వేగవంతం చేసింది. కెనాల్స్‌కు కాంక్రీట్ లైనింగ్ పనులు కూడా చేస్తోంది. జూలైలో నీళ్లను విడుదల చేయనున్నారు.

- **పుంగనూరు బ్రాంచి కెనాల్ లైనింగ్‌కు:** రూ.319 కోట్లు
- **ఆయకట్టు:** 37300 ఎకరాలు
- **నిండే చెరువులు:** 125
- **కుప్పం కెనాల్ లైనింగ్‌కు:** రూ.197 కోట్లు
- **ఆయకట్టు:** 6300 ఎకరాలు
- **నిండే చెరువులు:** 110

ఇరిగేషన్‌లో రూ.30 కోట్లు

పుంగనూరు నియోజకవర్గంలోని పది చెరువుల్ని రూ.5 కోట్లతో మరమ్మతు చేశారు. 2019లో ఆగిపోయిన నీరు- చెట్టు బిల్లుల్లో రూ.20 కోట్లకు పైగా మంజూరు చేయగా.. ఇంకా బిల్లుల్ని అప్‌లోడ్ చేస్తున్నారు.

రూ.5 కోట్ల ఎంపీ ల్యాడ్స్

చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావుకు కేటాయించిన రూ.5 కోట్ల ఎంపీ ల్యాడ్స్‌తో నాలుగు ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లకు మరమ్మతులు చేయించారు. శ్మశాన వాటికలను బాగు చేశారు. రూ.10 కోట్ల ప్రత్యేక నిధులతో జిల్లాలో 48 ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లను బాగు చేసే పనులు పురోగతిలో ఉన్నాయి.

పారిశ్రామిక పార్కుల ఏర్పాటు దిశగా..

నియోజకవర్గానికో ఎంఎస్ఎంఈ పార్కును ఏర్పాటు చేసేందుకు ఇటీవల మంత్రిమండలి ఆమోదించింది. ఈ ఏడాదిలో కుప్పం నియోజకవర్గం గుడుపల్లెలో 35 ఎకరాల్లో, పలమనేరులో 5 ఎకరాల్లో పారిశ్రామిక పార్కుల్ని ప్రారంభించారు. పూతలపట్టులో వంద ఎకరాలు, జీడీనెల్లూరులో 70 ఎకరాల భూమిని పరిశ్రమల స్థాపన కోసం ఏపీఐఐసీ గుర్తించింది.

8 వేల మంది రైతులకు శిక్షణ

రాష్ట్రంలో తొలిసారి మన జిల్లాలో స్కిల్ ఆఫ్ చిత్తూరు పేరుతో రైతులకు.. ప్రాథమిక డిజిటల్ నైపుణ్యాలపై శిక్షణ ఇస్తున్నారు. ఇందులో భాగంగా రైతులకు స్మార్ట్ ఫోన్ వాడకం, వాతావరణ సూచనల తనిఖీ, మార్కెట్ ధరల్ని పోల్చడం, డిజిటల్ చెల్లింపులు, వ్యవసాయ సలహాల కోసం సంప్రదించడం.. వంటి అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. తొలుత 8 గ్రామ సచివాలయాల్లో ప్రారంభించగా.. ప్రస్తుతం 18 మండలాల్లోని 78 సచివాలయాల పరిధిలో 8 వేల మందికిపైగా శిక్షణ ఇచ్చారు.

ఏనుగుల దాడులకు చెక్

నిత్యం ఏదో ఓ ప్రాంతంలో ఏనుగులు పంటలపై దాడులు చేసి తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయి. డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ప్రత్యేక దృష్టి సారించి కర్ణాటక ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుని మరీ మన జిల్లాకు నాలుగు కుంకీ ఏనుగుల్ని తెప్పించారు. పలమనేరు సమీపంలో 50 ఎకరాల్లో ఏర్పాటుచేసిన ఎలిఫెంట్ క్యాంపులో వీటిని ఉంచారు. మదపుటేనుగుల్ని ఈ కుంకీ ఏనుగులు అదుపు చేసి అడవిలోకి తరిమేస్తాయి.

అర్జీల పరిష్కారంలో సంతృప్తి

ఈ ఏడాది కలెక్టరేట్‌తో పాటు వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన పీజీఆర్ఎస్ ద్వారా సుమారు 53 వేల అర్జీలు అందాయి. అర్జీల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇచ్చిన కలెక్టర్ సుమిత్‌కుమార్ 80 శాతానికిపైగా పరిష్కరించారు.కుప్పంలో చేసిన సర్వేలో 44 శాతం మంది అర్జీదారులు తమ సమస్యలు పరిష్కారమయ్యాయని సంతృప్తి చెందారు. 33 శాతం మంది రిజెక్ట్ చేశారని బాధ పడ్డారు.

- ఏళ్లుగా పెండింగులో ఉన్న 400 ఆర్బిట్రేషన్ కేసుల్ని ఈ ఏడాదిలో క్లియర్ చేశారు. జాతీయ రహదారుల నిర్మాణంలో భూములు కోల్పోయిన నిర్వాసితులు పరిహారం సంతృప్తిగా లేదని ఆర్బిట్రేషన్ వేస్తుంటారు.
- ఈ ఏడాది జిల్లాస్థాయిలో 200 వరకు అంగన్వాడీ వర్కర్లను, వైద్యఆరోగ్యశాఖల్లో ఉద్యోగాలను ఎలాంటి కాంట్రవర్సీ లేకుండా భర్తీ చేశారు. వైసీపీ హయాంలో ఏ శాఖల్లో నియామకాలు చేపట్టినా తీవ్ర ఆరోపణలు వచ్చేవి.



కుప్పం బ్రాంచి కెనాల్‌కు కాంక్రీట్ పనులు

893 పనులు.. రూ.131.41 కోట్లు

● నేడు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు

కూటమి ప్రభుత్వం ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం జిల్లాలో పెద్దఎత్తున అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారు. రూ.80.95 కోట్ల విలువ చేసే 816 పనుల్ని ప్రారంభించనుండగా.. రూ.50.46 కోట్ల అంచనాతో 77 పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు. కలెక్టర్ సహా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, సర్పంచులు, ఎంపీపీలు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జులు ఈ కార్యక్రమాల్లో పాల్గొంటారు.

నలుగురు రెవెన్యూ అధికారులపై చర్యలు

● నగరిలో ప్రభుత్వ భూమిని కాపాడకపోవడమే కారణం

● వెదురుకుప్పం, ఆర్‌సీపురం తహసీల్దార్లు ,నగరి వీఆర్వో , ఓ రిటైర్డ్ వీఆర్వోపై చర్యలకు ప్రభుత్వ ఆదేశం

చిత్తూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): నగరి మండలంలో ఒకప్పుడు పనిచేసిన ఇద్దరు తహసీల్దార్లు, ఇద్దరు వీఆర్వోలపై చర్యలు తీసుకోమని రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయలక్ష్మి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరిపై మేజర్ పెనాల్టీ ఇంపోజ్ (కఠిన చర్యలు) చేయమని సీసీఎల్‌ఏకు సిఫార్సు చేశారు. ఈ నలుగురిలో ప్రస్తుత ఆర్‌సీపురం తహసీల్దార్ వెంకటరమణ, వెదురుకుప్పం తహసీల్దార్ బాబు, నగరి వీఆర్వో దేవదాసు, రిటైర్డ్ వీఆర్వో సదాశివపిళ్లై ఉన్నారు. ఈ నలుగురికి చార్జ్ మెమోలను ఇచ్చి, విచారణాధికారిని నియమిస్తారు.ఆ తర్వాత మేజర్ చర్యలు (ఇంక్రిమెంట్లు కట్ అవడం, డిమోషన్ ఇవ్వడం వంటివి) తీసుకుంటారు. వీరిపై ఈ చార్జెస్ ఉన్నంతవరకు ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లు,రిటైర్‌మెంట్‌బెనిఫిట్స్ లాంటివి అందవు.

అసలేం జరిగిందంటే.. : 2018-20 మధ్య నగరి మండలంలో చెరువు, కుంట, దారిని ఆక్రమించి టెంకాయ చెట్లను సాగు చేస్తున్నారని ఓ సర్పంచి లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. ఈ నలుగురు అధికారులు లోకాయుక్త ఆదేశాల మేరకు అక్కడ పరిశీలించి, చెట్లను తొలగించామని రిపోర్టు ఇచ్చారు. లోకాయుక్తలో పనిచేసే రిటైర్డ్ డీఎస్పీని విచారణకు ఆదేశించింది. క్షేత్రస్థాయిలో పరిస్థితి చూసిన ఆయన చెట్లను తొలగించలేదని రిపోర్టు ఇచ్చారు. కచ్చితంగా రెండు నెలల్లో తొలగించమని లోకాయుక్త మళ్లీ ఆదేశించింది. ఆ తర్వాత పనిచేసిన మరో తహసీల్దార్ చెట్లను తొలగించి లోకాయుక్తకు ఫొటోలు, వీడియోలతో సహా నివేదిక అందించారు. దీంతో గతంలో స్పందించని నలుగురి గురించి లోకాయుక్త సీసీఎల్‌కు ఫిర్యాదు చేసింది. సీసీఎల్ గతేడాది చిత్తూరు ప్రస్తుత జేసీ విద్యాధరిని విచారించమని ఆదేశించింది. ఆమె నివేదిక ఆధారంగా బుధవారం రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయలక్ష్మి ఉత్తర్వులను జారీ చేశారు.

ఆగి..సాగిన ఎస్జీటీల బదిలీ కౌన్సెలింగ్

స్పౌజ్ అంశంలో సమస్యలు ● ఉపాధ్యాయ సంఘ నేతలతో డీఆర్వో చర్చలు





ఉపాధ్యాయ సంఘాల నేతలతో చర్చిస్తున్న డీఆర్వో మోహన్‌కుమార్ -డీఆర్వో పర్యవేక్షణలో కొనసాగుతున్న టీచర్ల బదిలీ కౌన్సెలింగ్

చిత్తూరు సెంట్రల్, జూన్ 11(ఆంధ్రజ్యోతి):సెకండరీ గ్రేడ్ టీచర్ల (ఎస్జీటీ) బదిలీ కౌన్సెలింగ్ ప్రక్రియ అభ్యంతరాల నడుమ సాగుతోంది. రావాల్సిన పాయింట్లు రాకపోవడంతో అర్హత ఉన్నా, అనుకూల ప్రాంతాలు రాలేదంటూ టీచర్లు, ఉపాధ్యాయ సంఘాల నేతలు కౌన్సెలింగ్ ప్రక్రియలో పలు అభ్యంతరాలు లేవనెత్తారు.చిత్తూరు షర్మన్ మెమోరియల్ బాలికల పాఠశాలలో మంగళవారం రాత్రి 10.50 గంటలకు డీఈవో వరలక్ష్మి అధ్యక్షతన మొదలైన ఎస్జీటీల బదిలీ కౌన్సెలింగ్ బుధవారం తెల్లవారుజాము 3 గంటల వరకు సాగింది. 203మంది ఎస్జీటీలకు బదిలీలు పూర్తి చేశారు. 204వ టీచర్ బదిలీ వచ్చే సరికి స్పౌజ్ సమస్య తలెత్తడంతో దాన్ని నివారించడానికి ఉదయం 6.45 గంటలైంది. ఆపై కొనసాగుతూ ఉదయం 10.50 గంటల వరకు 212 వరకు చేరుకుంది. తర్వాత కూడా స్పౌజ్ అంశంలో సమస్యలు తలెత్తడం విద్యాశాఖ అధికారులకు తలనొప్పిగా మారింది.మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఉపాధ్యాయ సంఘాల నేతలకు విద్యాశాఖాధికారుల మధ్య సుదీర్ఘ వాదనలు సాగాయి. సమస్య తీవ్రతరం కావడంతో డీఈవో వరలక్ష్మి పరిస్థితులను కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు, విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు దృష్టికి తీసుకుపోయారు. ఈ క్రమంలో కలెక్టర్ ఆదేశాలతో డీఆర్వో మోహన్ కుమార్ రంగంలోకి దిగారు. దాదాపు 45 నిమిషాల పాటు ఉపాధ్యాయ సంఘాల నేతలు లేవనెత్తిన పలు సమస్యలపై డీఈవోతో పాటు ఫోన్లో రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్‌తోనూ సమీక్షించారు.చివరకు యూనియన్లు లేవనెత్తిన అంశాలు సరైనవి కావని స్పష్టం చేశారు.దీనిపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ పలువురు తమకు బదిలీ వద్దంటూ వెళ్లిపోయారు.డీఆర్వో దగ్గరుండి బదిలీ ప్రక్రియను కొనసాగించడంతో రాత్రి 7.15 గంటల వరకు 350 మంది టీచర్ల బదిలీ కౌన్సెలింగ్ పూర్తయింది. ఆపై 351 నుంచి 500 వరకు బదిలీ కౌన్సెలింగ్ కొనసాగించారు. కాగా గురువారం ఉదయం 11 గంటలకు 501 నుంచి వెయ్యి మంది వరకు బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు డీఈవో వరలక్ష్మి ప్రకటించారు.తిరుపతి డీఈవో కుమార్, చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య డీవైఈవోలు, చిత్తూరు ఏడీలు, ఉపాధ్యాయ సంఘాల నేతలు పాల్గొన్నారు.

రెవెన్యూశాఖలో బదిలీలు

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరుజిల్లాకు సంబంధించి రెవెన్యూశాఖలో తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్ల బదిలీ ప్రక్రియ నోడల్ అధికారి అయిన కలెక్టర్ సుమిత్‌కుమార్ నేతృత్వంలో జరిగింది. తిరుపతి, అన్నమయ్య జిల్లాల కలెక్టర్లతో రెండుసార్లు సమావేశాలు నిర్వహించిన అనంతరం బదిలీల ప్రక్రియ చేపట్టారు. చిత్తూరు అర్బన్ తహసీల్దార్ చంద్రశేఖర రెడ్డిని తిరుపతి జిల్లాకు, తిరుపతి జిల్లా డీఎస్వో కార్యాలయంలో పనిచేస్తున్న రేఖను చిత్తూరుజిల్లాకు బదిలీ చేశారు.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 24 మంది డిప్యూటీ తహసీల్దార్లకు అడహక్ పద్ధతిలో తహసీల్దార్లుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ జిల్లాలను కేటాయించారు.

● అన్నమయ్య జిల్లాకు కేటాయించిన డీటీలు :బావాజాన్ (సంబేపల్లి), హరికుమార్ (తంబళ్లపల్లె), రామాంజనేయులు (రామాపురం), ప్రదీప్ (ములకలచెరువు), వెంకటేశులు (ములకలచెరువు), క్రాంతికుమార్ (కేవీపల్లి), తపస్విని (కురబలకోట), మహమ్మద్ అజారుద్దీన్ (డీఎస్వో కార్యాలయం), నారు పమిలేటి (వాల్మీకిపురం).● తిరుపతి జిల్లాకు కేటాయించిన డీటీలు:శాంతి (ఆర్డీవో కార్యాలయం, శ్రీకాళహస్తి), తనూజ (డీఎస్వో కార్యాలయం, తిరుపతి).

● చిత్తూరు జిల్లాకు కేటాయించిన డీటీలు:రాజేంద్ర (తిరుపతి), పార్థసారథి (యాదమరి), రమేష్‌బాబు (పూతలపట్టు), కిరణ్ (విజయపురం), జయసింహ (పులిచెర్ల), శ్రీనివాసులు (తిరుపతి), శ్రావణ్‌కుమార్ (పెనుమూరు), రాధిక (తిరుపతి), నాగరాజు (కార్వేటినగరం), కౌలేష్ (విజయపురం), మాధవి (చౌడేపల్లి), కళ్యాణి (బంగారుపాళ్యం). వీరందరికీ ఆయా మండలాల్లో పోస్టింగులు ఇవ్వనున్నారు.

వరసిద్ధుడికి వెండి బిందె, పళ్లెం విరాళం


వెండి బిందె, అర్చన పళ్లెంను ఈవోకు అందిస్తున్న దాత

ఐరాల (కాణిపాకం), జూన్ 11 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి చిత్తూరుకు చెందిన శివభరద్వాజ్, కుటుంబ సభ్యులు వెండి బిందె, అర్చన పళ్లెంను బుధవారం ఈవో పెంచలకిషోర్‌కు ఆయన కార్యాలయంలో అందించారు. ఈవో మాట్లాడుతూ వెండి ఆభరణాలు 1కిలో 700 గ్రాముల బరువు కలిగి రూ.1,75,000 విలువ చేయనున్నట్లు తెలియజేశారు. అనంతరం దాత కుటుంబ సభ్యులకు ఈవో స్వామి దర్శన భాగ్యం కల్పించారు. కార్యక్రమంలో ఏఈవో రవీంద్ర బాబు, సూపరింటెండెంట్ కోదండపాణి తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాక్టరీలనుంచి రైతులు స్లిప్పులు తీసుకునేలా చూడాలి

● మార్కెటింగ్ ఏడీ పరమేశ్వరన్

చిత్తూరు సెంట్రల్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): గుజ్జు ఫ్యాక్టరీలకు మామిడిని విక్రయించిన రైతులు ఆయా యాజమాన్యాలనుంచి విక్రయానికి సంబంధించి స్లిప్పులు తప్పకుండా తీసుకునేలా చూడాలని మార్కెటింగ్ ఏడీ పరమేశ్వరన్ ఆశాఖ కార్యదర్శులకు సూచించారు. రైతులు ఫ్యాక్టరీలకు విక్రయించే మామిడి అంశాలపై బుధవారం తమ ఛాంబర్‌లో మార్కెటింగ్ కార్యదర్శులతో సమీక్షించారు. ఏడీ మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు కార్యదర్శులు కేటాయించిన ర్యాంపులు, ఫ్యాక్టరీల వద్ద ఉంటూ, రైతులు నష్టపోకుండా చూడాలన్నారు. గుజ్జు ఫ్యాక్టరీలకు రైతులు తెచ్చిన మామిడి లెక్కలు కట్టాలని, ఫ్యాక్టరీలకు విక్రయించిన తర్వాత ఎంత మామిడి విక్రయించారనే దానిపై ఆయా యాజమాన్యాల నుంచి స్లిప్పులు తీసుకుని వాటిని రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. అప్పుడే రైతులకు న్యాయం జరుగుతుందని, లేకుంటే లెక్కల్లో తేడాలు వచ్చి వారు నష్టపోయే వీలుందన్నారు. ఫ్యాక్టరీ యాజమాన్యాలు రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన గిట్టుబాటు ధర వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందించే కిలోకు రూ.4 సబ్సిడీ రైతులకు అందే విధంగా రికార్డుల్లో వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. సమావేశంలో సూపరింటెండెంట్ యాసిన్, బంగారుపాళ్యం, రొంపిచెర్ల, పాకాల, నగరి మార్కెట్ కమిటీ కార్యదర్శులు గంగయ్య, సురేష్‌బాబు, తులసీరాం, గుణశేఖర్, పాల్గొన్నారు.

మండలానికి 500 సూర్యఘర్ కనెక్షన్లు

● తప్పనిసరిగా ఇవ్వాలన్న ఎస్‌ఈ ఇస్మాయిల్ అహ్మద్

చిత్తూరు రూరల్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రతి మండలానికి 500 పీఎం సూర్యఘర్ సోలార్ కనెక్షన్లు తప్పనిసరిగా ఇవ్వాలని విద్యుత్ శాఖ ఎస్‌ఈ ఇస్మాయిల్ అహ్మద్ అన్నారు. బుధవారం గాంధీరోడ్డులోని విద్యుత్ శాఖ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నెలకు 300 యూనిట్లు దాటిన ఓసీ, బీసీ వినియోగదారులపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. వారికి ఈ పథకంపై పూర్తి అవగాహన కల్పించి సోలార్ ప్యానళ్లు ఏర్పాటు చేసుకునేలా చేయాలని అధికారులను ఆదేశించారు. బీసీలకు ప్రభుత్వం అదనంగా రూ.20 వేలు సబ్సిడీ ఇస్తోందనే విషయాలను వారికి తెలియజేయాలన్నారు. పీఎం సూర్యఘర్ పథకంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని చెప్పారు. వ్యవసాయ సర్వీసులను సకాలంలో మంజూరు చేయాలని, రైతులకు విద్యుత్ ఇబ్బందులు కలిగించవద్దని తెలిపారు. ఈ సమావేశంలో పీఎం సూర్యఘర్ ప్రత్యేక అధికారి సురేంద్రనాథ్, ఈఈ మునిచంద్ర, టెక్నికల్ ఈఈ జగదీష్, ఏవో ప్రసన్న ఆంజనేయులు, డీఈ ఆనంద్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ క్రికెట్ టోర్నీలో చిత్తూరు శతకాల మోత

అనంతపురం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): సీనియర్ వన్డే సౌత్‌జోన్ క్రికెట్ టోర్నీలో చిత్తూరు జట్టు శతకాల మోత మోగించింది. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ రాష్ట్రస్థాయి సౌత్‌జోన్ సీనియర్ వన్డే క్రికెట్ టోర్నమెంట్ రెండో రోజు బుధవారం అనంతపురం క్రికెట్ స్టేడియం(ఆర్డీటీ)లో కొనసాగింది. మొదటి మ్యాచ్‌లో చిత్తూరు, కడప జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన చిత్తూరు నిర్ణీత 50 ఓవర్లలో కేవలం 4వికెట్లు మాత్రమే కోల్పోయి 389 భారీ పరుగులు చేసింది.అభిషేక్ రెడ్డి 108 పరుగులు, జ్ఞానేశ్వర్ 116 పరుగులు, సూర్య 63 పరుగులు చేశారు. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన కడప 14.5 ఓవర్లలో వికెట్ నష్టానికి 94 పరుగులు చేసింది. ఇందులో ధృవకుమార్ 59 పరుగులు చేశాడు. వర్షం కారణంగా మ్యాచ్ ఆగిపోవడంతో డ్రాగా ప్రకటించారు. మరో మ్యాచ్ కర్నూలు, నెల్లూరు జట్ల మధ్య జరగగా వర్షం కారణంగా డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో నెల్లూరు 4వికెట్ల తేడాతో విజయం సాధించినట్లు ప్రకటించారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈగా విజయకుమార్

చిత్తూరు సిటీ, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈగా విజయకుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈఈగా ఉన్న నరేంద్ర కుమార్ తిరుపతి ఈఈగా బదిలీ అయ్యారు. అక్కడ ఉన్న వియకుమార్ బదిలీపై చిత్తూరుకు వచ్చారు. ఈయనకు ఇన్‌చార్జ్ ఎస్‌ఈగా ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. గతంలో తిరుపతి ఈఈగా ఉన్న విజయకుమార్ చిత్తూరు, తిరుపతి జిల్లాల ఇన్‌చార్జ్ ఎస్‌ఈగా బాధ్యతలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈసందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయ ఉద్యోగులు ఆయనను మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన డీడీ


కలెక్టర్‌ను కలిసిన సాంఘిక సంక్షేమశాఖ డీడీ విక్రమ్‌కుమార్‌రెడ్డి

చిత్తూరు అర్బన్, జూన్ 11(ఆంధ్రజ్యోతి) సాంఘిక సంక్షేమశాఖ డీడీగా విక్రమ్ కుమార్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డీడీగా ఉన్న చెన్నయ్యను ప్రభుత్వం గుంటూరు సాంఘిక సంక్షేమశాఖ డీడీగా బదిలీ చేసింది. తిరుపతి ఇన్‌ఛార్జీ డీడీగా ఉన్న విక్రమ్‌కుమార్ రెడ్డిని చిత్తూరు డీడీగా బదిలీ చేసింది. కాగా డీఆర్‌డీఏ పీడీగా ఉన్న శ్రీదేవిని ఎస్సీ కార్పొరేషన్ ఇన్‌చార్జి ఈడీగా నియమించారు.

టిప్పర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

ఐదుగురికి స్వల్పగాయాలు ● తృటిలో తప్పిన ప్రమాదం


ప్రమాదానికి గురైన బస్సు

పూతలపట్టు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సు వెనుకవైపు నుంచి టిప్పర్‌ను ఢీకొనడంతో ఐదుగురు ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. తిరుమల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు సుమారు 40 మంది ప్రయాణికులతో వేలూరుకు వెళుతుండగా పూతలపట్టు మండలం వడ్డార్లపల్లె సమీపాన ముందుగా వెళ్తున్న టిప్పర్ ఉన్నట్లుండి రోడ్డు క్రాస్‌చేయగా, టిప్పర్‌ను వెనుకవైపు నుంచి బస్సు ఢీకొంది. ఈ సంఘటనలో ఐదుగురు ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇదిలావుండగా బస్సు డ్రైవర్ చాకచక్యంగా బ్రేకు వేయడంతో తృటిలో పెనుప్రమాదం తప్పింది. లేకుంటే ఘోరప్రమాదం జరిగేది.

ర్యాంపులకూ లైసెన్సులు

చిత్తూరు సెంట్రల్, జూన్ 11(ఆంధ్రజ్యోతి):ఎన్నడూ లేని విధంగా జిల్లాలోని 41మామిడి ర్యాంపుదారులకు లైసెన్సులు ఇవ్వనున్నారు.జిల్లాలో చిత్తూరు, బంగారుపాళ్యం మామిడి మార్కెట్ యార్డులతో పాటు 35 గుజ్జు పరిశ్రమలున్నాయి.వీటితో పాటు 41 మామిడి ర్యాంపులున్నాయి. వీటిలో రైతులు తమ మామిడి పంటను విక్రయించుకునే వీలుంది.ర్యాంపుదారులను కూడా చట్టపరిధిలోకి తీసుకువచ్చేందుకు కలెక్టర్ సుమిత్ కుమార్ 41 మామిడి ర్యాంపు దారులకు లైసెన్సులు ఇవ్వాలని నిర్ణయించారు. అయితే ఆ లైసెన్సులు ఉద్యాన శాఖ పరిధిలోకా, మార్కెటింగ్ శాఖ పరిధిలోకా అనేదానిపై స్పష్టత రావాల్సి ఉంది.

బడికి పోదాం

● నేడు పాఠశాలల పునఃప్రారంభం



చిత్తూరు సెంట్రల్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ఆటపాటలకు టాటా చెప్పి గురువారం నుంచి చిన్నారులు బడిబాట పట్టనున్నారు.బదిలీలు, పదోన్నతుల కారణంగా కొత్త అయ్యోర్లు విద్యార్థులకు స్వాగతం పలకనున్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది విద్యా వ్యవస్థలో సంస్కరణలకు శ్రీకారం చుట్టడంతో పలు మార్పులు చోటు చేసుకున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో వారం రోజుల పాటు సంసిద్ధత కార్యక్రమాలు చేపట్టనున్నారు.బయటున్న బడిఈడు పిల్లలను టీచర్లు బడిలో చేర్పించే కార్యక్రమం చేపట్టనున్నారు.' సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర' పథకం కింద స్టూడెంట్ కిట్స్ ఉచితంగా అందజేయనున్నారు. పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు, వర్క్‌బుక్స్‌తో పాటు యూనిఫాం ఇతరత్రా విద్యాసామగ్రిని క్యూఆర్ కోడ్ ద్వారా విద్యార్థులక ందిస్తారు.

489 మోడల్ ప్రైమరీ పాఠశాలలు

జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్య పాఠశాలలు 2889 ఉన్నాయి. వీటిలో ప్రాథమిక పాఠశాలలు 2115, ప్రాథమికోన్నత పాఠశాలలు 237, ఉన్నత పాఠశాలలు 537 ఉన్నాయి.మొత్తం 2,33,959 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా కేంద్రంగా 4719 పాఠశాలల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియను ప్రభుత్వం చేపట్టింది. అంగన్‌వాడీల నుంచి ఇంటర్మీడియట్ విద్య వరకు ప్రభుత్వ, జడ్పీ, ఎంపీపీ, మున్సిపల్, కార్పొరేషన్ పాఠశాలలను తొమ్మిది రకాలుగా విభజించారు.489 పాఠశాలలను మోడల్ ప్రైమరీ పాఠశాలలుగా తీర్చిదిద్దారు. కుప్పం ఏరియా డెవలప్మెంట్ అథారిటీ (కడ) కింద 17 పాఠశాలలను గుర్తించగా, జిల్లావ్యాప్తంగా 472 పాఠశాలలను గుర్తించారు. ప్రతి పాఠశాలలోనూ మనబడి-మన భవిష్యత్ కింద ఖచ్చితంగా ఐదు తరగతులు, ఐదుగురు టీచర్లు ,60 మంది విద్యార్థులు ఉండేలా చర్యలు చేపట్టారు. జాతీయ విద్యాహక్కు చట్టం అమలులో భాగంగా 162 ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా ఉన్నతీకరించారు.

మధ్యాహ్న భోజనంలో సమూలమార్పులు

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ బడుల్లో మధ్యాహ్న భోజనం నాణ్యత పెంచేందుకు సన్నబియ్యం సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.పాఠశాలలు, కళాశాలలు, వసతిగృహాలు కలిసి 4327 ఉండగా, వాటిలో 2,50,379 మంది విద్యార్థులకు నేటినుంచి మధ్యాహ్న భోజనం అందనుంది. ప్రతినెలా మధ్యాహ్న భోజనానికి 460 మెట్రిక్ టన్నుల బియ్యం అవసరం. గతంలో పౌరసరఫరాలశాఖ ద్వారా మండలస్థాయి స్టాక్‌పాయింట్ల నుంచి డీలర్‌కు, అక్కడి నుంచి పాఠశాలలకు తరలించేవారు. ఈ ప్రక్రియలో అక్రమాలు చోటుచేసుకున్నాయని గుర్తించి ఎం.ఎల్. పాయింట్ల నుంచి పాఠశాలలకు, వసతిగృహాలకు తరలించాలని నిర్ణయించారు. 25 కిలోల బస్తాలరూపంలో క్యూఆర్‌కోడ్‌తో కుట్టిన ట్యాగ్‌తో సరఫరా చేశారు. దీన్ని ప్రధానోపాధ్యాయులు స్కాన్ చేసి, ఓటీపీ ఆధారంగా పాఠశాల కోటాను తీసుకుంటారు.

స్విమ్స్‌ను అత్యుత్తమ వ్యవస్థగా తీర్చిదిద్దుతాం

● స్నాతకోత్సవంలో చాన్సలర్ బీఆర్ నాయుడు



వేదికపై టీటీడీ చైర్మన్, చాన్సలర్ బీఆర్ నాయుడు, ముఖ్యఅతిథి హనుమంతరావు, టీటీడీ సభ్యురాలు సుచిత్ర తదితరులు - పట్టా తీసుకునే విద్యార్థులతో ప్రతిజ్ఞ

తిరుపతి(వైద్యం), జూన్ 11(ఆంధ్రజ్యోతి): స్విమ్స్‌ను దేశంలో అత్యుత్తమ వ్యవస్థగా తీర్చిదిద్దుతామని స్విమ్స్ చాన్సలర్, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు పేర్కొన్నారు. తిరుపతిలోని మహతితో బుధవారం జరిగిన స్విమ్స్ యూనివర్సిటీ 13వ స్నాతకోత్సవంలో ఆయన మాట్లాడారు. ఏటా స్విమ్స్‌కు టీటీడీ రూ.వంద కోట్లు వెచ్చిస్తూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తోందన్నారు. వైద్యులు, సిబ్బంది, వైద్య పరికరాల కొరత లేకుండా మరో రూ.71 కోట్ల వరకు వెచ్చించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. భవిష్యత్తులో ఏఐ ఆధారిత వైద్య సేవలు, రోబోటిక్ శస్త్ర చికిత్సలు, ఆన్‌లైన్ ఓపీడీ సేవలను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. స్విమ్స్‌లో వేల మంది రోగులకు వైద్యసేవలతో పాటు వర్సిటీలో ఏటా వందల మంది వైద్యులను, సిబ్బందిని తీర్చిదిద్దుతుండటం గొప్ప విషయమని టీటీడీ ఈవో శ్యామలరావు పేర్కొన్నారు. ధనార్జనే ధ్యేయంగా కాకుండా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించి వారి ప్రాణాలు నిలబెట్టడంలో ప్రతిభ చూపాలని ముఖ్య అతిథి, ఎయిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సీఈవో డాక్టర్ హనుమంతరావు డాక్టర్లకు సూచించారు. అధునాతన వైద్య పరిజ్ఞానంతో వైద్య సేవలు అందించాలని వైద్య విద్యార్థులకు చెప్పారు. అనంతరం వైద్య విద్య పూర్తి చేసుకున్న 501 మందికి డాక్టర్ పట్టాలు, వైద్య విద్యలో ఉత్తమ ప్రతిభ చూపిన 40 మందికి బంగారు పతకాలు, ఎంబీబీఎస్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన డాక్టర్లు అభిప్న, నికిత గిద్వానికి రూ.25 వేల నగదు బహుమతి, ఎక్కువ మార్కులు సాధించిన డాక్టర్లు నాగేంద్రప్రసాద్, బుద్దగారి ప్రేమ్‌కు మెరిట్ సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. రోగులకు నిస్వార్థ సేవ అందిస్తామంటూ డాక్టర్ పట్టాలు అందుకున్న వారితో స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఇంకా టీటీడీ సభ్యులు సుచిత్ర ఎల్లా, సదాశివరావు, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, డీఎంఈ అకడమిక్ డాక్టర్ రఘునందన్, స్విమ్స్ డీన్ అల్లాడి మోహన్, రిజిస్ట్రార్ అపర్ణ ఆర్ బిట్లా, వైద్య విభాగాధిపతులు నరేంద్ర, జానకి, సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎలిఫెంట్ క్యాంప్ సమీపంలోనే ఏనుగుల విధ్వంసం


ఏనుగుల దాడిలో ధ్వంసమైన పశుగ్రాసాన్ని చూపుతున్న రైతు


ఏనుగులు విరిచేసిన మామిడిచెట్లు

పలమనేరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : ఏనుగుల దాడులను అరికట్టేందుకు ఏర్పాటు చేసిన ఎలిఫెంట్ క్యాంప్ సమీపంలో మంగళవారం రాత్రి ఏనుగులు పంటపొలాలపై విధ్వంసం సృష్టించాయి. పలమనేరు మండలం ముసలిమడుగు గ్రామ సమీపంలోని సుమారు 50 ఎకరాల విస్తీర్ణంలో అటవీశాఖ ఎలిఫెంట్ క్యాంపును ఏర్పాటు చేసింది. ఈ ఎలిఫెంట్ క్యాంపునకు కర్ణాటక రాష్ట్రం నుంచి 6 కుంకీ ఏనుగులను తెప్పించారు. మంగళవారం రాత్రి ఈ ఎలిఫెంట్ క్యాంపునకు కూతవేటు దూరంలో నాలుగు ఏనుగుల గుంపు ముసలిమడుగు గ్రామానికి చెందిన రైతులు దామోదరనాయుడు, పాపయ్యనాయుడు, మునస్వామినాయుడు అమరమ్మ, రామచంద్రనాయుడు, రాజశేఖర్‌లకు చెందిన మామిడిచెట్లు, పశుగ్రాసాన్ని ధ్వంసం చేశాయి. మళ్లీ ఏనుగులు వస్తుండటంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కుంకీ ఏనుగులు తీసుకొచ్చినా ప్రయోజనం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా అటవీశాఖ అధికారులు స్పందించి అటవీ సరిహద్దుల్లో తమ పంటలకు రక్షణ కల్పించాలని రైతులు కోరుతున్నారు.


లారీలో పశువులు - పశువులను పరిశీలిస్తున్న ఏడీహెచ్ శ్రీనివాసులు, సీఐ రాంభూపాల్

లారీల్లో కబేళాలకు తరలుతున్న ఆవులు

అడ్డుకున్న యువకులు ● అక్రమ రవాణాపై కేసు నమోదు

సోమల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): సోమల మార్గంలో కేరళ రాష్ట్రంలోని కబేళాలకు అక్రమంగా తరలిపోతున్న 4 లారీల్లోని పశువులను సోమల హిందూ సంఘాల యువకులు బుధవారం అడ్డుకున్నారు. పలమనేరు వైపు పశువులను అక్రమంగా తరలిస్తున్న సమాచారంతో ఇరికిపెంట వద్ద బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గన్నా మదన్‌మోహన్‌బాబు ఆధ్వర్యంలో పలువురు యువకులు 4 లారీలను అడ్డుకున్నారు. నాలుగు లారీల్లో 138 పశువులను అక్రమంగా అధిక సంఖ్యలో తరలిస్తున్న సంఘటనతో పశుసంవర్ధక శాఖ ఏడీహెచ్ శ్రీనివాసులు నాయుడుకు, సోమల ఎస్‌ఐ శివశంకర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు అక్కడికి చేరుకొని నాలుగు లారీలోని పశువులను సోమల మార్కెట్ యార్డుకు తరలించారు. పుంగనూరు సీఐ రాంభూపాల్ అక్కడికి చేరుకోవడంతో గో అక్రమ రవాణాదారులపై చర్యలు తీసుకోవాలని.. 138 పశువులను అక్రమదారుల నుంచి రక్షించాలని హిందూ సంఘాల వారు విన్నవించారు. గో అక్రమ రవాణాను పోలీసులు అడ్డుకోవాలని కోరారు. విచారించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో పడి యువకుడి గల్లంతు

గంగవరం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు చెరువులో పడి యువకుడు గల్లంతైన సంఘటన మండలంలోని అటుకురాళ్లపల్లె గ్రామంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. బైరెడ్డిపల్లె మండలం ఇల్లూరు గ్రామానికి చెందిన శ్రీనివాసులు రెడ్డి (27), గంగవరం మండలం అటుకురాళ్లపల్లెలో గంగపండుగ నిమిత్తం వారి బంధువుల ఇంటికి వచ్చాడు. బుధవారం సాయంత్రం గ్రామ సమీపంలోని ఈతలకుంట చెరువు వద్దకు వెళ్లివస్తానని చెప్పి వెళ్లిన శ్రీనివాసులు రెడ్డి ఎంతసేపటికీ తిరిగిరాలేదు. దీంతో అనుమానం వచ్చి వారి బంధువులు చెరువు వద్దకు వెళ్లి చూడగా చెరువు గట్టుపై చెప్పులు కనిపించాయి. దీంతో నీటిలో మునిగిపోయి ఉంటాడని భావించి వారి బంధువులు పోలీసులకు, ఫైర్ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు, ఫైర్ సిబ్బంది చేరుకొని గల్లంతైన శ్రీనివాసులురెడ్డి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి 7.30 గంటల వరకు వెతికినా శ్రీనివాసులు రెడ్డి ఆచూకీ తెలియరాలేదు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు ప్రారంభించామని గంగవరం అర్బన్ సీఐ ప్రసాద్ తెలిపారు.

నేడు, రేపు ఆర్టీసీ బస్‌పాసుల సేవలు బంద్

చిత్తూరు రూరల్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కొత్త ఆర్టీసీ బస్ పాసులు మంజూరు చేయనున్న నేపథ్యంలో ఈ నెల 12, 13 తేదీల్లో విద్యార్థుల బస్‌పాసుల నుంచి అన్ని రకాల బస్‌పాస్ కౌంటర్లు పనిచేయవని డీపీటీవో జగదీష్ తెలిపారు.ఇప్పుడున్న బస్‌పాసుల స్థానంలో కొత్త రంగులతో బస్‌పాసులు ఇవ్వనున్నట్లు తెలిపారు. కొత్త పాసులు విజయవాడ నుంచి రావాల్సి ఉందని, అందు కోసం రెండు రోజుల పాటు బస్‌పాస్ సేవలను నిలిపివేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. 14వ తేదీ నుంచి కొత్త పాసులతో యథావిధిగా బస్‌పాస్ కౌంటర్లు పనిచేస్తాయని ఆయన తెలిపారు.

మా తోతాపురిని అనుమతించండి : ఏపీ సీఎస్‌కు కర్ణాటక లేఖ

బెంగళూరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో తోతాపురి మామిడిసాగు చేసే రైతులకు షాక్ తగిలింది. ఇక్కడి నుంచి తరలివెళ్లే మామిడిని చిత్తూరు జిల్లాలోకి అనుమతించకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. కర్ణాటకలో అత్యధికంగా కోలారు జిల్లా శ్రీనివాసపుర తాలూకాలో మామిడిసాగు చేస్తారు. చిత్తూరు జిల్లాలోని మామిడి గుజ్జు పరిశ్రమలకు విక్రయిస్తారు. అయితే ఇతర రాష్ట్రాల తోతాపురి మామిడి చిత్తూరు జిల్లాలోకి రానివ్వకుండా అడ్డుకుంటుండడంతో నష్టపోతున్నామంటూ కోలారు, చిక్కబళ్లాపుర జిల్లాల రైతులు ప్రభుత్వానికి విన్నవించారు. చిత్తూరు జిల్లాలో మామిడిపంటకు గిట్టుబాటు ధర కల్పించేందుకే అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ఈనేపథ్యంలో కర్ణాటక చీఫ్ సెక్రటరీ శాలిని రజనీశ్ మంగళవారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధానకార్యదర్శికి ఒక లేఖ పంపారు. కర్ణాటక రైతులకు అన్యాయం జరగకుండా చూడాలని కోరారు.

పంటలపై కొనసాగుతున్న గజదాడులు


ధ్వంసమైన మామిడిచెట్టు

కల్లూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై గజదాడులు కొనసాగుతూనే ఉన్నాయి. మండలంలోని దేవళంపేట పంచాయతీలో మంగళవారం రాత్రి ఏనుగుల గుంపు పంటలను ధ్వంసం చేయడంతో పంటలకు తీవ్రనష్టం వాటిల్లింది. తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని చింతలవంక నుంచి బయలుదేరిన 14 ఏనుగుల గుంపు దేవళంపేట పంచాయతీ గెండువారిపల్లి వద్దకు చేరుకున్నాయి. గ్రామంలోని రైతు రవి పొలంలోని మామిడిచెట్లు, నీటి పైపులను ఏనుగులు ధ్వంసం చేశాయి. మరో రైతు కుమార్‌రెడ్డికి చెందిన మామిడిచెట్లను విరిచేసిన ఏనుగుల గుంపు చిన్ననగరి వైపు అడుగులు వేశాయి. మార్గంలోని పలువురు రైతుల మామిడిచెట్లను విరుచుకుంటూ చిన్ననగరిలోని రైతు రెడ్డెమ్మ తదితరుల పశుగ్రాసాన్ని ఏనుగులు తొక్కేశాయి. అక్కడి నుంచి వచ్చిన మార్గంలోనే తిరుగుముఖం పట్టిన ఏనుగుల గుంపు అడవిలోని సూరప్పచెరువు వద్ద తిష్ట వేసినట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. ఏనుగుల గుంపు మామిడిచెట్లపై చేస్తున్న దాడులతో టన్నుల కొద్దీ మామిడికాయలు నేలరాలుతున్నట్లు బాధిత రైతులు వాపోయారు. ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలని కోరారు.

చిరుత దాడిలో దూడ మృతి


పులి దాడిలో మృతిచెందిన దూడను పరిశీలిస్తున్న అటవీ అధికారులు

చౌడేపల్లె, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): చిరుతపులి దాడిలో పేయ దూడ మృతిచెందిన సంఘటన చౌడేపల్లె మండలంలో బుధవారం ఉదయం జరిగింది. బాధితుల కథనం మేరకు.. స్థానిక గోసలకురప్పల్లెకు చెందిన కుమార్‌కు చౌడేపల్లె సమీపంలోని అంకాలమ్మ కొండ సమీపంలోని కలాచ్చమ్మ బావి వద్ద కొంత వ్యవసాయ పొలం ఉంది. ఆయన కుటుంబ సభ్యులు వ్యవసాయం చేసుకుంటూ పాడి ఆవులు మేపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కుమార్‌తోపాటు ఆయన అన్నదమ్ములకు ఉన్న 8 పాడి ఆవులను పొలం వద్దే మేపుకుంటూ రాత్రి సమయాల్లో పొలం వద్ద ఉన్న పందిరిలోనే ఉంచుతారు. మంగళవారం అర్ధరాత్రి చిరుత పులి పొలం వద్ద ఆవులతోపాటు ఉన్న పేయ దూడపై దాడి చేసి చంపేసింది. ఉదయం చిరుత పులి దాడిలో దూడ మృతి చెందినట్లు గుర్తించారు. విషయం తెలుసుకున్న ఎఫ్‌బీవో ప్రభాకర్ సంఘటన స్థలానికి చేరుకుని చిరుత పులి అడుగులను పరిశీలించారు. చిరుతపులి దాడి చేసినట్లు గుర్తించి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. పశువైద్యులు డాక్టర్ పవన్‌కుమార్ పోస్టుమార్టం నిర్వహించారు.

బీఎన్‌ఆర్ పేట ఐటీఐ ప్రిన్సిపాల్‌గా నగేష్



చిత్తూరు రూరల్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): చిత్తూరు రూరల్ మండలంలోని బీఎన్‌ఆర్ పేట ఐటీఐ ప్రిన్సిపాల్‌గా నగేష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న సాంబమూర్తి నెల్లూరు జిల్లా పొదలకూరు ఐటీఐకి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో శాంతిపురం ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్‌గా ఉన్న నగేష్ బీఎన్‌ఆర్ పేట ఐటీఐకి వచ్చారు.

ఆక్సిజన్ ప్లాంట్లకు మోక్షం

● వంద పడకల ఆస్పత్రిలో ప్రతి బెడ్డుకూ సరఫరా



పలమనేరులోని 100 పడకల ప్రభుత్వాస్పత్రి / కరోనా సమయంలో ఏర్పాటు చేసిన ఆక్సిజన్ ప్లాంట్లు, /జరుగుతున్న పనులు

పలమనేరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : లక్షలాది రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన ఆక్సిజన్ ప్లాంట్లను అధికారులు ఎట్టకేలకు వినియోగంలోకి తీసుకొస్తున్నారు. పలమనేరు లోని వందపడకల ఏరియా ఆస్పత్రిలో కరోనా సమయంలో రోగుల కోసం రెండు ఆక్సిజన్ ప్లాంట్లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అప్పట్లో పాత భవనంలోని ఈ ఆస్పత్రిలో ప్రత్యేక ఆక్సిజన్ సిలెండర్లతో కరోనా బాధితులకు, ఇతర రోగులకు ఆక్సిజన్ అందించేవారు. అయితే ఏడాదిన్నర క్రితం పలమనేరు ప్రభుత్వాస్పత్రికి నూతన భవనాలు నిర్మించి ఎన్నికల ముందు అప్పటి జిల్లా మంత్రి పెద్దిరెడ్డి నూతన భవనాలు ప్రారంభించారు. అయితే నూతన భవనాలు నిర్మించినప్పటికీ ఆస్పత్రిలోని ఆపరేషన్ థియేటర్లకు, బెడ్లకు ఆక్సిజన్ కనెక్షన్ మాత్రం ఇవ్వలేదు.

నూతన భవనాలు నిర్మించి ఏడాది గడిచిపోతున్నా రెండు ఆక్సిజన్ ప్లాంట్లు ఈ ఆసుపత్రిలో వృథాగా ఉండేవి. అయితే నెలరోజులుగా దేశంలోని పలురాష్ట్రాల్లో మళ్లీ కరోనా బాధితుల సంఖ్య నమోదు అవుతుండటంతో ప్రభుత్వం స్పందించింది. కరోనా విజృంభిస్తే ఆస్పత్రుల్లో రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించింది. దీంతో పలమనేరు లోని 100 పడకల ఏరియా ఆస్పత్రి వైద్యాధికారులు స్పందించారు. ఆసుపత్రిలోని అన్ని వార్డుల్లోని పడకల వద్దకు రోగులకు క్షణాల్లో ఆక్సిజన్ అందించే విధంగా ఆక్సిజన్ కనెక్షన్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకొన్నారు. దాదాపు నెల రోజులుగా ఈ పనులు జరుగుతుండగా మరో వారం రోజుల్లోపు అన్ని పడకలకు, అధునాతన ఆపరేషన్ థియేటర్లకు ఆక్సిజన్ పైప్‌లైన్ల ఏర్పాటు పనులు పూర్తిచేయనున్నట్లు అధికారులు తెలిపారు.

సమష్టి సహకారంతోనే మండలాభివృద్ధి సాధ్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో లీలామాధవి

చౌడేపల్లె, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): సమష్టి సహకారంతోనే మండలాభివృద్ధి సాధ్యమని. . గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీవో లీలామాధవి అన్నారు. బుధవారం ఎంపీపీ సుధాకర్‌రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వేరుశనగ విత్తనాల కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని.. సక్రమంగా పంపిణీ చేయాలని సూచించారు. ఏవో జ్యోతమ్మ మాట్లాడుతూ గత ఏడాది 1,629 క్వింటాళ్ల విత్తనాలు సరఫరా అయ్యాయని.. గత ఏడాది సాగు తగ్గడంతో ప్రస్తుతం 1,059 క్వింటాళ్ల విత్తనాలు రావడంతో కొరత ఏర్పడిందన్నారు. అన్నదాత సుఖీభవ కోసం ప్రతి రైతు తప్పనిసరిగా ఈకేవైసీ చేసుకోవాలన్నారు. అలాగే స్థానిక ప్రభుత్వాస్పత్రిలో వైద్యులు అందుబాటులో ఉండటం లేదని, గత వారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ ఓ వ్యక్తి ఆస్పత్రికి వస్తే వైద్య సిబ్బంది అందుబాటులో లేకపోవడం దారుణమని పలువురు సభ్యులు వాపోయారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చందన మాట్లాడుతూ తాగునీటి సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. గతంకంటే విద్యుత్తు బిల్లులు అధికంగా వస్తున్నాయని ఏఈ శశిధర్‌ను వైస్ ఎంపీపీ నరసింహారెడ్డి ప్రశ్నించడంతో ఏపీఈఆర్‌సీ ప్రకారం బిల్లులు వస్తాయని.. తమ పరిధి కాదని ఏఈ సమాధానం ఇచ్చారు. ఇళ్లు లేనివారు దరఖాస్తు చేసుకోవాలని హౌసింగ్ ఏఈ మణి తెలిపారు. రాయితీ పశువుల దాణ కోసం పాడిరైతులు నమోదు చేసుకోవాలని పశువైద్యాధికారి దినేష్‌రెడ్డి పేర్కొన్నారు. రేషన్ కార్డులు లేనివారు, మార్పుల చేర్పుల కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ హనుమంతు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ సుధాకర్‌రెడ్డి, ఎంఈవో కేశవరెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షులు కృష్ణారెడ్డి, మండల స్థాయి అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఏఆర్ హాస్పిటల్‌లో డీఎంహెచ్‌వో విచారణ

● నకిలీ వైద్యుడిపై పోలీసులకు ఫిర్యాదు



విచారిస్తున్న డీఎంహెచ్‌వో సుధారాణి

కుప్పం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): కుప్పం పట్టణం ప్యాలెస్ రోడ్డులోని ఏఆర్ హాస్పిటల్ పేరుతో ప్రాక్టీస్ చేస్తున్న అరుణ్ అన్నాత్‌పై బుధవారం సాయంత్రం జిల్లా వైద్య ఆరోగ్యాధికారి డాక్టర్ సుధారాణి విచారణ జరిపారు. ఇదే హాస్పిటల్‌లో మంగళవారం తనిఖీలు చేసిన కడా పీడీ వికాస్ మర్మత్, అరుణ్ అన్నాత్‌ను నకిలీ వైద్యుడిగా ప్రాథమికంగా తేల్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో విచారణ జరిపిన జిల్లా వైద్య ఆరోగ్యాధికారి సైతం ఆయన వద్ద వైద్యుడిగా ధ్రువీకరించే ఎలాంటి పత్రాలు లేవని, కనీసం మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ సైతం లేదని నిర్ధారించుకున్నారు. దీంతో అరుణ్ అన్నాత్‌ను నకిలీ వైద్యుడిగా ధ్రువీకరించి అతడిపై కుప్పం అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై జిల్లా వైద్య ఆరోగ్యాధికారి డాక్టర్ సుధారాణి 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ అరుణ్ అన్నాత్ ఎటువంటి వైద్య ధ్రువీకరణ పత్రాలు లేకనే ప్రాక్టీస్ పెట్టి, జనాలను మోసం చేస్తున్నారని చెప్పారు. డీఎంహెచ్‌వో చేసిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి నకిలీ వైద్యుడిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కుప్పం అర్బన్ సీఐ శంకరయ్య తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

పుంగనూరు రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): సుగాలిమిట్ట సమీపంలో మంగళవారం రాత్రి కారు ఢీకొని గాయపడిన వ్యక్తి బుధవారం మృతి చెందినట్లు ఏఎస్ఐ అశ్వర్థనారాయణ తెలిపారు. మదనపల్లె మండలం నారమాకులపల్లె తాండకు చెందిన గోపినాథ్ (50) పుంగనూరు మండలం సుగాలిమిట్ట వద్ద రోడ్డుపై వెళుతుండగా కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడినట్లు తెలిపారు. మదనపల్లెకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ కార్యకర్తల రక్తదానం



కేక్ కోసి సంబరాలు జరుపుకుంటున్న టీడీపీ నాయకులు

చౌడేపల్లె, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మండలాధ్యక్షులు గువ్వల రమేష్‌రెడ్డి జన్మదినం సందర్భంగా బుధవారం స్థానిక బస్టాండులో టీడీపీ కార్యకర్తలు, నాయకులు అన్నదానం నిర్వహించారు. స్థానిక సీహెచ్‌సీలో టీడీపీ కార్యకర్తలు రక్తదానం నిర్వహించి రోగులకు పండ్లు పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు బాబునాయుడు, చంద్రమౌళి, కళ్యాణ్, మహ్మద్‌గని, వేలూరు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

వి.కోట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): చిన్నారులు మృతిచెందిన ఘటనను డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లి సాయం అందించేందుకు కృషి చేస్తామని జనసేన మండల కన్వీనర్ బాబు తెలిపారు. బుధవారం గ్రామానికి చేరుకున్న జనసేన నేతలు బాధిత కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ.8 వేలు చొప్పున ఆర్థిక సాయం అందించారు. మండల పార్టీ కార్యదర్శి ధనుంజయగౌడు, నేతలు హరీష్, విజయ్, కళ్యాణ్, గంగా, మహేంద్ర, సాంబ పాల్గొన్నారు.

నేడు ఎయిర్‌పోర్టు భూనిర్వాసితులతో కలెక్టర్ సమావేశం

రామకుప్పం/శాంతిపురం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గం రామకుప్పం, శాంతిపురం మండలాల నడుమ నిర్మించనున్న గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టు భూనిర్వాసితులతో గురువారం కలెక్టర్ సుమిత్‌కుమార్ సమావేశం కానున్నారు. సంయుక్త కలెక్టర్ విద్యాధరి, కడా పీడీ వికాస్ మర్మత్, రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాసరావు, ఎయిర్ పోర్టు ఎల్‌పీ అధికారులు పాల్గొంటారు. ఉదయం 10 గంటలకు శాంతిపురం, మధ్యాహ్నం 3 గంటలకు రామకుప్పంలో నిర్వహించే సమావేశాల్లో కలెక్టర్ పాల్గొంటారని తహసీల్దార్లు శివయ్య, కౌలేష్ తెలిపారు. ఈ సమావేశాలకు ఎయిర్ పోర్టు పరిధిలో భూములున్న రైతులతోపాటు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

గోపాలకృష్ణయ్యకు నివాళులు



భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

పలమనేరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పలమనేరుకు చెందిన సీనియర్ అడ్వకేట్ గోపాలకృష్ణయ్య (74) అనారోగ్యంతో మంగళవారం బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందు తూ మృతిచెందారు. బుధవారం జడ్పీచైర్మన్ శ్రీనివాసులు, బార్ అసోసియేషన్ సభ్యులు, పలువురు పట్టణ వాసులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడానికే క్రీడాపోటీలు



క్రీడాకారులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న జనసేన నాయకుడు వేణుగోపాల్‌రెడ్డి

పుంగనూరు రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని యువతను క్రీడా రంగంలో ప్రోత్సహించడానికే క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు జనసేన నాయకుడు వేణుగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. గంగజాతర సందర్భంగా గత మూడు రోజుల పాటు మండలంలోని ఏడుతాండాల నుంచి క్రీడాకారులను ఎంపిక చేసి క్రికెట్ పోటీలు నిర్వహించారు. క్రికెట్ పోటీల్లో మొదటిస్థానంలో నిలిచిన నక్కలదిన్నెతాండా యువతకు రూ.20,116, ద్వితీయ స్థానంలో నిలిచిన నల్లగుట్లపల్లె తాండా యువతకు రూ.10,116 ప్రోత్సాహక బహుతులు అందజేశారు కార్యక్రమంలో జనసేన నాయకులు విరూపాక్షి, శివకుమార్‌రెడ్డి, బాలాజీ నాయక్, పవన్ కుమార్‌నాయక్, హరినాయక్, శ్రీనివాసులు, కృష్ణప్ప, మురళీ, రేవంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యంపై కేసు నమోదు



విశ్వతేజ (ఫైల్ ఫొటో)

చౌడేపల్లె, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి అదృశ్యమైన సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ స్థానిక బజారువీధిలో కాపురం ఉంటున్న అమర్నాథ్ కుమారుడు విశ్వతేజ(17) తిరుపతిలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈక్రమంలో ఇంటర్ పరీక్ష ఫలితాల్లో మార్కులు తక్కువ వచ్చాయని కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో ఈనెల 7న మధ్యాహ్నం నుంచి కనిపించడం లేదని అతని తండ్రి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పశువుల అక్రమ రవాణాపై కేసు నమోదు

పుంగనూరు , జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పశువులను అక్రమ మార్గంలో తరలిస్తున్న లారీ డ్రైవర్, క్లీనర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లోకేశ్ తెలిపారు. బుధవారం మండలంలోని ఈడిగపల్లె వద్ద ఆర్‌ఎస్ఎస్‌కు చెందిన కొంతమంది యువకులు లారీని నిలిపి సమాచారం ఇచ్చినట్లు సీఐ తెలిపారు. సంఘటనా స్థలానికి చేరుకుని ఆవులను మార్కెట్ యార్డుకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వివరించారు.

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం



యోగా చేస్తున్న విద్యార్థులు

శాంతిపురం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని పరమహంస యోగానంద విద్యాలయ ప్రిన్సిపల్ ఆజాద్ హుస్సేన్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర ఉత్సవాలను నిర్వహించడం జరుతుందని తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం పరమహంస యోగానంద విద్యాలయంలో యోగాంధ్ర ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి యోగాసనాలు చేపట్టారు. కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపల్ పార్థీవులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బస్‌షెల్టర్ ఎదుటే మురుగునీటి కాలువ



మురుగునీటి కాలువ వద్ద నిర్మించిన బస్‌షెల్టర్

పలమనేరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పలమనేరులోని జాతీయ రహదారి పక్కనే అటవీశాఖ కార్యాలయం వద్ద నిర్మించిన బస్సు షెల్టర్ నిరుపయోగంగా మారింది. సుమారు నెలరోజుల క్రితం చిత్తూరు వైపు వెళ్లే ప్రయాణికుల కోసం బస్‌షెల్టర్‌ను నిర్మించారు. బస్‌షెల్టర్ రోడ్డుకు పక్కనే అందుబాటులో లేకుండా రాజకాలువకు వెనుక వైపు నిర్మించారు. దీంతో ప్రయాణికులు ఈ రాజకాలువను దాటుకొని బస్‌షెల్టర్ వద్దకు వెళ్లాలంటే వీలుకావడం లేదు. అంతేకాక రోడ్డుకు సుమారు 20 అడుగుల వెనుకకు నిర్మించడంతో బస్సులు వస్తున్న విషయం సైతం బస్‌షెల్టర్‌లో కూర్చొన్న వారికి తెలిసే అవకాశం లేదు. కనీసం రాజకాలువపై అధికారులు కల్వర్టు నిర్మిస్తే ఈ బస్‌షెల్టర్ కొంతవరకైనా వినియోగించుకునే అవకాశం ఉంటుంది. ప్రజాధనం నిరుపయోగం కాకుండా వెంటనే రాజకాలువపై కల్వర్టు నిర్మించాలని.. బస్‌షెల్టర్ కనిపించే విధంగా ఆక్రమణలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యార్థులకు సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం



పాఠశాలకు చేరిన సన్నబియ్యం బస్తాలను పరిశీలిస్తున్న ఎంఈవో కేశవరెడ్డి

చౌడేపల్లె, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడుల్లో ఇకపై విద్యార్థులకు సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం అందించనున్నట్లు ఎంఈవో కేశవరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన స్థానిక హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం కోసం సరఫరా అయిన సన్న బియ్యం బస్తాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 12 నుంచి పాఠశాలలు తిరిగి ప్రారంభం కానున్నాయని.. సన్న బియ్యంతో రుచికరమైన, నాణ్యతగా భోజనం అందించేందుకు అన్నిచర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పాఠశాల మొదటి రోజే పాఠ్య పుస్తకాల పంపిణీ ఉంటుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగరాజరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగ విత్తనాల పంపిణీ



విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు, నాయకులు

రామకుప్పం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం ఉన్సిగానిపల్లె రైతు సేవా కేంద్రంలో బుధవారం రైతులకు వేరుశనగ విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి అమృత, టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి రామ్మూర్తి, ఎస్సీసెల్ జిల్లా కార్యదర్శి జయశంకర్, నేతలు గుర్రప్ప, కృష్ణారెడ్డి, శంకర్‌చలం, మహేంద్రనాయుడు, మణేష్‌నాయుడు, రామలింగం, గోపాల్‌రెడ్డి, బీరప్ప తదితరులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వో తనిఖీలు



కమతమూరు అర్బన్ హెల్త్ సెంటర్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ సుధారాణి

కుప్పం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): కుప్పం పురపాలక సంఘం పరిధిలోని కమతమూరు పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యాధికారి డాక్టర్ టీడీ.సుధారాణి తనిఖీ చేశారు. అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై రికార్డులు, నివేదికలను పరిశీలించారు. ఆయా కార్యక్రమాల నిర్వహణ గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ప్రజారోగ్యంపై శ్రద్ధ వహించాలని హెల్త్ సెంటర్లకు వచ్చే రోగులపై మర్యాదగా వ్యవహరించి సరైన వైద్యం అందించాలని సూచించారు. ఆస్పత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. చంటి బిడ్డలకు వ్యాధి నిరోధక టీకాలు తప్పకుండా తల్లులు వేయించేలా శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీపీఎంవో డాక్టర్ ప్రవీణ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రానైట్ లారీల స్వాధీనం



అక్రమంగా గ్రానైట్ తరలిస్తూ పట్టుబడిన లారీలు

చౌడేపల్లె, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా గ్రానైట్ తరలిస్తున్న లారీలను బుధ వారం సీజ్ చేసినట్లు తిరుపతి ఎన్‌ఫోర్స్‌మెంట్ అండ్ విజిలెన్స్ అధికారి కరీముల్లా షరీఫ్ పేర్కొన్నారు. ఎలాంటి రసీదులు లేకుండా అక్ర మంగా గ్రానైట్ తరలిస్తున్న రెండు లారీలు, ఒక ఇసుక లారీని చౌడేపల్లె సీజ్ చేసి స్థానిక పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. అక్రమ రవాణా చేస్తున్న వాహనాలకు జరిమానా విధించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

వైభవంగా గంగమ్మ ఆలయ మండలాభిషేకం



భక్తులకు ఉపదేశం చేస్తున్న కమలానంద భారతి

వి.కోట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): వి.కోట మండలం గుమ్మిరెడ్డిపల్లెలో వెలసిన పెద్దపులి గంగమ్మ ఆలయ మండలాభిషేకం అత్యంత వైభవంగా జరిగింది. గత రెండు రోజులుగా ఆలయ ఆవరణలో పూజలు, హోమాలు చేపట్టారు. బుధవారం ఉదయం అమ్మవారికి పాలాభిషేకం నిర్వహించారు. ఆలయంలో జరిగిన మండలాభిషేకానికి భువనేశ్వరి పీఠాధిపతులు కమలానంద భారతి స్వామి పాల్గొని దేవతల విశిష్టతను భక్తులకు వివరించారు. హైందవ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఉపదేశించారు. అనంతరం వి.కోట పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయం, పునఃనిర్మిస్తున్న నగరీశ్వర దేవాలయ ప్రాంగణాలకు ఆయన చేరుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు దామోదర్‌రెడ్డి, పురుషోత్తంనాయుడు, తుకారం, రమేష్, మురుగేష్, శ్రీనివాసులు, ఆంజనేయులు, బాలాజీ, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అర్జున తపస్మాన్



సోమల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భారతంమిట్టలో మహాభారత యజ్ఞం సందర్భంగా బుధవారం అర్జున తపస్మాన్ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉభయదారులు బత్తలసూరి, ప్రకాశ్ కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో నిలువెత్తు తపస్మాన్‌కు అర్చకులు రామరత్నంశాస్త్రిచే పూజలు చేశారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళలు పవిత్రా స్నానాలాచరించి తడి బట్టలతో తపస్మాన్ వద్ద అర్జున పాత్రధారి తపస్మాన్ చివరకు చేరుకుని తన జోలిలో పూజించిన నిమ్మకాయలను అక్కడి నుంచి చల్లడంతో పోటీపడి దక్కించుకున్నారు. చెన్నయ్యగారిపల్లె, ఇరికిపెంట, గన్నావారిపల్లె, నడింపల్లె, నీలావారిపల్లె, సోమల, దిడ్డివారిపల్లె, కరకమంద, రాశెట్టివారిపల్లె, పాయలవారిపల్లె, వడ్డిపల్లె తదితర ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయ మహాకుంభాభిషేకం



ఆలయ గోపురంపై కలశస్థాపన, అలంకరణలో గంగమ్మ

రామకుప్పం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండల సరిహద్దులోని రాజుపేటక్రాస్‌లో గంగమ్మ ఆలయ కుంభాభిషేక మహోత్సవాలు బుధవారంతో ముగిశాయి. బుధవారం కుంభాభిషేకం వైభవంగా జరిగింది. ఉదయం 7 గంటలకు వేదపండితులు సందీప్‌శర్మ, నాగరాజుశర్మల ఆధ్వర్యంలో పండితులు వేదపారాయణం చేశారు. 9 గంటలకు వివిధ రకాల హోమాలు నిర్వహించి అమ్మవారి మూలమూర్తికి ప్రతేక అభిషేక పూజలు చేపట్టారు. మధ్యాహ్నం 12.30 గంటలకు అభిజిత్ లగ్నంలో గోపురంపై కలశ స్థాపన నిర్వహించారు. భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు.

శేషాద్రిస్వామి ఆలయంలో పౌర్ణమి పూజలు



బైరెడ్డిపల్లె, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లెలోని శేషాద్రిస్వామి ఆలయంలో బుధవారం పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు తిప్పయ్యాచార్యులు స్వామివారికి అభిషేకం చేసి విశేషాలంకరణతో పూజలు జరిపారు. పలువురు భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. శ్రీవారి సేవకుడు ధనంజయ గౌడు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జరిగింది. సాయంత్రం ఆలయం వద్ద కళాబృందాలచే కోలాట ప్రదర్శనలు, భజనలు నిర్వహించారు.

సుగాలిమిట్టలో గంగజాతర



అలంకరణలో గంగమ్మ

పుంగనూరు రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుగాలిమిట్ట గ్రామంలో బోయకొండ గంగమ్మ జాతరను బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. గత 41 రోజుల పాటు ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు చేపట్టారు.

వీరభద్రస్వామికి ఢమరుకం వితరణ



ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న జనసేన నాయకులు

గంగవరం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జరావారిపల్లె గ్రామంలో వెలసిన వీర భ ద్ర స్వామి ఆలయానికి జనసేన నాయకులు బుధవారం ఢమరుకాన్ని వితరణ చేశారు. బుధవారం వీరభద్రస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూలతో అలంకరించి పూజలు చేశారు. జనసేన మండలాధ్యక్షురాలు మంజుల, పూల చైతన్య, విజయ్, శివకుమార్, కవీశ్వర్, విజయ్, లోకేష్, మునిరాజు, శ్రీధర్, జయప్ప, వెంకటేష్, కిశోర్ పాల్గొన్నారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

ప్రజాసమస్యలను వెంటనే పరిష్కరించాలి

● ఎమ్మెల్యే భానుప్రకాష్


అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

నగరి జూన్ 11 (ఆంధ్రజ్యోతి): నగరి నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాలు, రెండు మున్సిపాలిటీల్లోని ప్రజల సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అన్నారు. నగరి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం నియోజకవర్గ స్థాయి అధికారులతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రేషన్‌కార్డులు, హౌసింగ్ మంజూరు విషయంలో పారదర్శకంగా వ్యవహరించి అర్హులందరికీ అందేలా చూడాలన్నారు. ప్రజలను పదేపదే కార్యాలయాల వద్దకు తిప్పించుకుంటూ, పరుష పదజాలాలతో దూషిస్తే కఠిన చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. ఆర్డీవో భవానిశంకరికి అలాంటి వారెవరైనా వుంటే పరిశీలించి చర్యలు తీసుకోమని ఎమ్మెల్యే సూచించారు. తహశీల్దార్లు రవికుమార్, కిరణ్, కమిషనర్ కృష్ణారెడ్డి, మంజునాథ్, ఎంపీడీవోలు, అన్నిశాఖల ఇంజనీరింగ్ అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మా పాఠశాలను మార్చకండి



పాఠశాల వద్ద నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

చిత్తూరు సెంట్రల్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మా పాఠశాలను మార్చరాదంటూ చిత్తూరు మురకంబట్టు అగ్రహారం గ్రామస్థులు బుధవారం పాఠశాల ముందు నిరసన చేపట్టారు. గురువారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభమవుతున్న నేపథ్యంలో తమ పాఠశాలను ఇక్కడే ఉంచాలని లేని పక్షంలో తాము నిరసన కొనసాగించనున్నట్లు స్పష్టం చేశారు. గ్రామస్థులు ప్రతిమ, సతీష్, గాయత్రీ మాట్లాడుతూ మురకంబట్టు అగ్రహారం ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి ఐదు తరగతుల వరకు 31మంది విద్యార్థులు చదువుతున్నారన్నారు. మోడల్ స్కూల్ పేరుతో మా గ్రామ పాఠశాల నుంచి మూడు నుంచి ఐదు తరగతుల విద్యార్థులను కిలోమీటరు సమీపంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోకి మార్పు చేయడం సరికాదన్నారు. దీని ద్వారా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని ఆవేదన వ్యక్తంచేశారు. సమస్యను ఇప్పటికే కలెక్టర్, ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోయామన్నారు. పాఠశాలను మార్చితే, గ్రామస్థులం పెద్ద ఎత్తున నిరసనకు దిగుతామన్నారు. నిరసన వ్యక్తం చేసిన వారిలో గ్రామానికి చెందిన మౌనిక, లత, మునెమ్మ, వనజ తదితరులు ఉన్నారు.

టీడీపీ నాయకుడికి ఎమ్మెల్యేల నివాళి


సుబ్రమణ్యం నాయుడి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

శ్రీరంగరాజపురం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబరమహారాజపురం పంచాయతీ గొల్లపల్లి చెందిన టీడీపీ జిల్లా ప్రత్యేక ఆహ్వానితులు బోడపాటి లోకనాథం నాయుడి సోదరుడు ఆ పార్టీ నాయకుడు సుబ్రమణ్యం నాయుడు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. బుధవారం కర్మక్రియల సందర్భంగా చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు గురజాల జగన్‌మోహన్, మురళీమోహన్, కర్ణాటక మాజీమంత్రి కట్టా సుబ్రమణ్యం నాయుడు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బోడపాటి లోకనాథం నాయుడు, ఆనంద నాయుడు ఇంటికెళ్లి పరామర్శించారు. టీడీపీ సీనియర్ నాయకులు గ్యాస్ రవికుమార్, గంధమనేని రాజశేఖర్ నాయుడు, కర్జాల అరుణమ్మ, బాలాజీ నాయుడు, మునివర్ధ నాయుడు, గుండయ్య, సుబ్రమణ్యం నాయుడు, భాస్కర్ నాయుడు, బీగాల రమేష్, వేమ నాయుడు, పైనేని మురళి, రవి, సిద్ధయ్యశెట్టి, మాధవ నాయుడు, బ్రహ్మ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సత్యనారాయణ స్వామి వ్రతం


సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహిస్తున్న భక్తులు, గరుడ వాహనంపై దర్శనమిస్తున్న వరదరాజస్వామి

ఐరాల(కాణిపాకం), జూన్ 11(ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి అనుబంధంగా ఉన్న వరదరాజస్వామి ఆలయంలో బుధవారం సత్యనారాయణ స్వామి వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. వరదరాజస్వామి ఆలయంలో మూల విరాట్‌కు అభిషేకం నిర్వహించి, సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సత్యనారాయణ స్వామి చిత్రపటాన్ని ఉంచి భక్తుల చేత సత్యనారాయణ వ్రతాన్ని నిర్వహింపజేశారు. రాత్రి వరదరాజస్వామి విగ్రహాన్ని గరుడ వాహనంపై ఉంచి ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో పెంచలకిషోర్, ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్లు బాలాజీ నాయుడు, రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు అంబులెన్స్‌ల ఆగడాలను అరికట్టండి: టీడీపీ


డాక్టర్ మంజులకు వినతిపత్రం అందిస్తున్న టీడీపీ నాయకులు

నగరి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): నగరి ఏరియా వైద్యశాల నుంచి రెఫర్ చేసిన రోగులను వివిధ వైద్యశాలలకు తరలించడానికి ప్రైవేటు అంబులెన్స్ యజమానులు ఇష్టానుసారం అద్దె వసూలు చేస్తున్నారని, వారి ఆగడాలను అరికట్టాలంటూ ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ మంజులకు బుధవారం టీడీపీ నాయకులు వినతిపత్రం అందించారు. ప్రైవేటు అంబులెన్స్‌ల కారణంగా పేషెంట్లు ఎదుర్కొనే సమస్యల గురించి ఆమెకు వివరించారు. ఆగడాలకు పాల్పడేవారిపై చర్యలు తీసుకోవాలని డాక్టర్ మంజులను వారు కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర టీఎన్‌టీయూసీ కార్యదర్శి బాలాజీ, దేశమ్మగుడి మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, నగరి మండల టీడీపీ అధ్యక్షుడు జవహర్‌రెడ్డి, టీఎన్‌టీయూసీ చిత్తూరు జిల్లా అధికారప్రతినిధి జ్యోతి నాయుడు, ఎం.వి.శ్రీనివాసులు, మణి, లోకేష్, మదన్ తదితరులు పాల్గొన్నారు.

తోతాపురికి మద్దతు ధర ఇవ్వండి: కలెక్టర్


గాజులపల్లె వద్ద మామిడి గుజ్జు పరిశ్రమ యాజమాన్యంతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

తవణంపల్లె, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తోతాపురి మామిడి రైతులకు ప్రకటించిన మద్దతు ధరను రైతులకు మామిడి గుజ్జు యాజమాన్యాలు అందించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని గాజులపల్లె సమీపంలోని జీసీఆర్ ఫుడ్ అండ్ బేవరేజస్ ఫ్యాక్టరీని కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులకు అందిస్తున్న ధరలు తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో పండించే తోతాపురి మామిడిని మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. తద్వారా రైతులకు మేలు జరుగుతుందన్నారు. రైతులకు ముందస్తుగా టోకెన్లు మంజూరు చేసి, పక్వానికి వచ్చిన కాయలను మాత్రమే గుజ్జు పరిశ్రమలకు తరలించేలా వారికి అవగాహన కల్పించాలన్నారు. ప్రతి మామిడి గుజ్జు పరిశ్రమ వద్ద ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు సంబంధించిన బోర్డు ఏర్పాటుచేయాలని పరిశ్రమల్లో నియమించిన సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుధాకర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న మినీలారీ - ఒకరి మృతి


మణిరెడ్డి (ఫైల్‌ఫొటో)

బంగారుపాళ్యం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిలో నలగాంపల్లె వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా, మరో వ్యక్తి స్వల్పగాయాలతో బయటపడ్డ సంఘటన బుధవారం ఉదయం చోటుచేసుకుంది. సీఐ శ్రీనివాసులు కథనం మేరకు వివరాలు.. యాదమరి మండలం సీఆర్ కండ్రిగకు చెందిన లేట్ బోడిరెడ్డి కుమారుడు మణిరెడ్డి, అదే గ్రామానికి చెందిన వెంకటరెడ్డిలు మామిడి కాయలను బంగారుపాళ్యం మార్కెట్ యార్డుకు ట్రాక్టర్‌లో మంగళవారం సాయంత్రం తీసుకొచ్చారు. మామిడి కాయలను అమ్మిన తర్వాత బుధవారం ఉదయం 5.30 గంటల ప్రాంతంలో తిరిగి సీఆర్ కండ్రిగకు బయలుదేరారు. నలగాంపల్లె వద్దకు చేరుకోగానే బెంగళూరు నుంచి అల్లం లోడుతో విజయవాడ వెళుతున్న మినీలారీ.. ట్రాక్టర్ ట్రాలీని వెనుక నుంచి వేగంగా ఢీకొంది. దీంతో ట్రాక్టర్‌ను నడుపుతున్న మణిరెడ్డి రోడ్డుకి కుడివైపు పడిపోగా, వెంకటరెడ్డి ఎడమవైపు ఎగిరి పడిపోయారు. దీంతో మినీలారీ మణిరెడ్డి(63) తలపై నుంచి దూసుకెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందగా, వెంకటరెడ్డి మాత్రం స్వల్పగాయాలతో బయటపడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

లారీ ఢీకొని ఇద్దరికి గాయాలు


గాయపడిన రాజేష్, పూర్ణిమ,

చిత్తూరు అర్బన్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని ఇద్దరికి గాయాలైన సంఘటన బుధవారం నగర శివారులో జరిగింది. ట్రాఫిక్ సీఐ నిత్యబాబు వివరాల మేరకు... ఐరాల మండలం మామిడిగుంటపల్లెకు చెందిన రాజేష్, పూర్ణిమలు తమ పిల్లలతో కలిసి ద్విచక్ర వాహనంలో చిత్తూరుకు బయలుదేరారు. మార్గమధ్యంలో కాణిపాకం సర్కిల్ వద్ద దాటుతుండగా తిరుపతి వైపు వెళుతున్న లారీ వెనుకభాగంలో తగలడంతో ద్విచక్ర వాహనం కింద పడిపోయింది. ఈ ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలవ్వగా, పిల్లలకు ఎలాంటి గాయం కాలేదు. ట్రాఫిక్ సీఐ నిత్యబాబు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ఆటో చోరీ

చిత్తూరు అర్బన్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ఇంటి వద్ద ఉంచిన ఆటోను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ మహేశ్వర వివరాల మేరకు.. నగరంలోని వినాయకపురానికి చెందిన మహమ్మద్ ఆలీ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. గత నెల 25న పగలంతా ఆటోను నడిపి రాత్రి ఇంటికి చేరుకున్నారు. ఇంటి బయట ఆటోను పెట్టి.. ఇంటిలో పడుకున్నాడు. మరుసటి రోజు ఇంటి బయట ఆటో కనపడలేదు. దాంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బెదిరించిన ఘటనలో ఒకరికి రిమాండ్

చిత్తూరు అర్బన్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఓ వ్యక్తిని చంపేస్తామని బెదిరించి దాడి చేసిన ఘటనపై బుధవారం ఒకటో పట్టణ పోలీసులు ఓ వ్యక్తిని రిమాండ్‌కు తరలించారు. ఒకటవ పట్టణ సీఐ మహేశ్వర వివరాల మేరకు.. నగరంలోని జానకారపల్లెకు చెందిన సింగనమలై, మల్లికార్జున స్నేహితులు. గత నెల 29వ తేదీన ఇద్దరు కలిసి మద్యం సేవించారు. మద్యం మత్తులో మల్లికార్జున ఫోన్, డబ్బును ఇవ్వాలని సింగనమలై అడిగాడు. అతడు ఇవ్వకపోవడంతో ఘర్షణ పడ్డారు. మల్లికార్జున ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు బుధవారం సింగనమలైను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. కాగా సింగనమలైపై రెండో పట్టణ పోలీసు స్టేషన్‌లో రౌడీషీట్ ఉంది.

ప్రభుత్వ పాఠశాలల్లోనే బంగారు భవిష్యత్తు


కరపత్రాలను విడుదల చేస్తున్న అధికారులు

పెనుమూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పాఠశాలలకు అధిక ప్రాధాన్యతనిస్తూ విద్యార్థులకు బంగారు భవిష్యత్తు అందించే దిశగా అడుగులు వేస్తోందని ఎంపీడీవో నీలకంఠేశ్వరరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలల కరపత్రాలను అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి విద్యార్థికి 'తల్లికి వందనం' పథకం వర్తింపజేసి తల్లిదండ్రులకు ఆర్థిక చేయూతనందిస్తోందని తెలిపారు. అనంతరం పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రశంసించారు. ఎంఈవోలు రాజేంద్ర, భాస్కర్ నాయుడు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకరకు ఆటో కానుక


టీడీపీ కార్యకర్తకు ఆటో విరాళంగా అందిస్తున్న ఎమ్మెల్యే

నగరి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): నగరి మండలం తెరణి గ్రామానికి చెందిన విజయసారథి అనే టీడీపీ కార్యకర్తకు ఎమ్మెల్యే భానుప్రకాష్ బుధవారం ఆటోను విరాళంగా అందించారు. గత ఎన్నికల్లో తన గెలుపు కోసం ఆటోలో విస్తృతంగా ప్రచారం చేసిన విజయసారథికి తాను గెలిస్తే ఆటో కొనిస్తానని ఆయన మాట ఇచ్చారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ బుధవారం అతడికి ఆటోను అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర టీఎన్‌టీయూసీ కార్యదర్శి బాలాజీ, నగరి మండల టీడీపీ అధ్యక్షుడు జవహర్‌రెడ్డి, నాయకులు మధు నాయుడు, గుణ తదితరులు పాల్గొన్నారు.

సమాచారశాఖ డీడీగా వేలాయుధం


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న సమాచారశాఖ డీడీ వేలాయుధం

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): జిల్లా సమాచారశాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా వేలాయుధం బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను, జేసీ విద్యాధరిని మర్యాదపూర్వకంగా కలిశారు. కాగా ఇక్కడ డీడీగా పనిచేస్తున్న పద్మజను కడపజిల్లా డీడీగా, అలాగే చిత్తూరులో ఏపీఆర్వోగా పనిచేస్తున్న వెంకటరమణను అనంతపురం ఏపీఆర్వోగా బదిలీచేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

పలుకుబడి ఉన్నవారికే టోకెన్లు..?

● తలలు పట్టుకుంటున్న మామిడి రైతులు

● అధికారులు చొరవ చూపాలని వినతి


కోతదశలో ఉన్న మామిడికాయలు

యాదమరి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మామిడి రైతులు తీవ్రంగా నష్టపోతున్నామని తలలు పట్టుకుంటున్నారు. మండలంలోని దాదాపు 24 గ్రామ రెవిన్యూ పరిధిలో మొత్తం ఏడువేల హెక్టార్ల భూముల్లో ప్రధాన పంటగా 4800 హెక్టార్లు మామిడి, వెయ్యి హెక్టార్లలో కొబ్బరి, మిగిలిన 1400 హెక్టార్లలో నీటి లభ్యత ఆధారంగా సాధారణ, వర్షాధార పంటలను రైతులు సాగుచేస్తున్నారు. గత ఏడాది జూన్‌నెలలో కేజీ రూ.25 చొప్పున మంచి ధర పలికిన తోతాపురి... ఈ సీజన్‌లో అడిగే నాథుడే లేడని రైతులు బాధపడుతున్నారు. ఒకవైపు రేట్లు లేక కుదేలు అవుతుంటే మరోవైపు వర్షాల కారణంగా మామిడికాయలు రంగు మారి పురుగులుపట్టి దెబ్బతింటాయని రైతాంగం దిగులుపడుతున్నారు. కాగా రాష్ట్ర ప్రభుత్వం పల్ప్ ఫ్యాక్టరీల ద్వారా కొనుగోలు చేసే విధంగా నిర్ణయించింది. ఫ్యాక్టరీలో కాయలు పక్వానికి వచ్చినవాటినే కొనుగోలు చేస్తామని నిబంధనల కారణంగా రైతులు పండించిన పంట ఎలా అమ్ముకోవాలో అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు.

● టోకెన్లు పలుకుబడి ఉన్నవారికేనా... అందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని మామిడి రైతులు డిమాండ్ చేస్తున్నారు. సంవత్సరమంతా కష్టపడి పండించి చేతికొచ్చిన పంటను కొనేవారు లేక, గిట్టుబాటు ధరలేక తీవ్రంగా నష్టపోయామని రైతులు వాపోతున్నారు.

తోతాపురి టన్నుకు రూ.4వేలు ప్రకటించినా వైసీపీ నానాయాగి భావ్యంకాదు: టీడీపీ


జైన్‌ఫ్యాక్టరీ జీఎం దిలీప్‌తో మాట్లాడుతున్న కృష్ణమ నాయుడు

గంగాధరనెల్లూరు, జూన్ 11 (ఆంధ్ర జ్యోతి): కూటమి ప్రభుత్వం తరఫున తోతాపురి మామిడి రైతుకు టన్నుకు రూ4వేలు ఆర్థిక సహాయం అందజేస్తామని ప్రకటించినా వైసీపీ నేతలు నానాయాగి చేయడం భావ్యంకాదని పార్లమెంట్ టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు, జిల్లా టీడీపీ యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్‌లు అన్నారు. గంగాధరనెల్లూరు పంచాయతీ 100 గొల్లపల్లె జైన్‌ఫ్యాక్టరీలో బుధవారం జనరల్ మేనేజర్ దిలీప్‌తో పలువురు టీడీపీ నేతలు కలిసి మాట్లాడారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ విప్ థామస్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని తోతాపురి మామిడి పంట దిగుబడి ఉన్న రైతులకు పర్మిట్లు పెంచి ఇచ్చే విషయంలో మరింత వెసులుబాటు కల్గించేందుకు జైన్ ఫ్యాక్టరీ జనరల్ మేనేజర్‌ను చొరవ చూపాలని కోరామన్నారు. ఈ విషయాలను దృష్టిలో పెట్టుకుని రెండు మూడు రోజుల్లోగా జైన్ ఫ్యాక్టరీ రెండవ ప్లాంట్‌లో ప్రాసెసింగ్ పని ప్రారంభిస్తామని, ఆ తర్వాత రైతులకు పర్మిట్లు ఇచ్చే సంఖ్యను పెంచగలమని జనరల్ మేనేజర్ హామి ఇచ్చారని వారు చెప్పారు. ఈకార్యక్రమంలో టీడీపీ నేతలు బాబు నాయుడు, స్వామిదాస్, జ్యోతి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు సహకరించాలి


రైతులతో మాట్లాడుతున్న పోలీసులు

గుడిపాల, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మామిడి రైతులు టోకెన్ల కోసం తొందరపడకుండా సహకరించాలని పోలీసులు, ఫ్యాక్టరీ మేనేజర్ చంద్రశేఖర్ అన్నారు. బుధవారం మండలంలోని గొల్లమడుగు వద్దనున్న మ్యాంగో ఫ్యాక్టరీ వద్ద రైతులు టోకెన్ల కోసం ఎగబడటంతో ఉద్రికత్తత ఏర్పడింది. వెంటనే ఫ్యాక్టరీ మేనేజర్ కలుగ జేసుకుని రైతులకు న్యాయం చేస్తామన్నారు. ఎవరూ తోసులాడుకోవద్దన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రోజుకు 80 నుంచి 100 టోకెన్లు అందిస్తున్నామన్నారు. ఆలస్యమైన రైతులు సమన్వయం పాటించాలన్నారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

● 47 మంది పేదలకు ఇంటి పట్టాల పంపిణీ


ఇంటి పట్టాలు పంపిణీ చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

తవణంపల్లె, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. బుధవారం మండలంలోని ఎ.గొల్లపల్లె పంచాయతీ దళితవాడలో 25 సంవత్సరాలుగా నివాసముంటున్న 47 మంది లబ్ధిదారులకు కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే మురళీమోహన్‌లు ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ పంచాయతీ అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అనంతరం ఎ.గొల్లపల్లెలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఏరువాక పౌర్ణమి కార్యక్రమంలో భాగంగా కలెక్టర్, ఎమ్మెల్యేలు ఎద్దులకు, నాగలికి పూజలు నిర్వహించి, భూమి పూజ చేసి, దుక్కు దున్ని విత్తనాలు వేశారు. అలాగే ఉపాధి హామి నిధులు రూ.5 లక్షలతో నిర్మించిన బృందావనాన్ని, రూ.18 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎ.గొల్లపల్లె సర్పంచ్ సబిత, మాజీ జడ్పీటీసీ వెంకటేష్‌చౌదరి, బంగారుపాళ్యం మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్ నాయుడు, నాయకులు ప్రవీణ్, మోహన్ నాయుడు, అమరేంద్ర నాయుడు, ధనంజయ నాయుడు, జేడీ మురళీకృష్ణ, తహసీల్దార్ సుధాకర్, ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి, పీఆర్‌డీఈ ప్రసాద్ నాయుడు, ఏఈ జయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంగజాతర


గంగజాతరలో పాల్గొన్న సీకే సాయికృష్ణారెడ్డి

చిత్తూరు కల్చరల్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): నగరపాలక పరిధిలోని పెద్దశెట్టిపల్లెలో బుధవారం నడివీధి గంగమ్మ జాతర ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే సీకే బాబు కుమారుడు సాయికృష్ణారెడ్డి పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం అమ్మవారిని అంగరంగ వైభవంగా జల ప్రవేశం నిర్వహించారు. నగరంలోని వెంగళరావు కాలనీ, శ్రీనివాసపురం, వైఎస్సార్ కాలనీ, గుడిసెగుండ్లు, తేనెబండ తదితర ప్రాంతల్లో నడివీధి గంగమ్మలకు ఉత్సవ నిర్వాహకులు జలప్రవేశాలు నిర్వహించారు.

బంగారుపాళ్యం గంగమ్మ ఊరేగింపు


ఊరేగింపులో బంగారుపాళ్యం గంగమ్మ, ఉట్లమాను ఎక్కేందుకు పోటీ పడుతున్న యువకులు

బంగారుపాళ్యం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బంగారుపాళ్యం దళితవాడలో జరుగుతున్న గంగజాతరలో భాగంగా బుధవారం రాత్రి గంగమ్మ ఊరేగింపు ఘనంగా జరిగింది. గంగమ్మను సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తుల జనసందోహం మధ్య గంగమ్మను మండల పురవీధుల్లో ఊరేగించారు. జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన ఉట్లమాను ఎక్కేందుకు యువకులు భారీగా పోటీపడ్డారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ శ్రీనివాసులు పకడ్బందీ చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు. అదే విధంగా మండలంలోని మొగిలివెంకటగిరి, జంబువారిపల్లె, గుండ్లకట్టమంచి గ్రామాల్లో గంగజాతర ఘనంగా జరిగింది.

వైభవంగా ముగిసిన గంగమ్మ జాతర

వెదురుకుప్పం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం విజయమాంబాపురంలో గంగమ్మ జాతర వేడుకలు వైభవంగా బుధవారం ముగిశాయి. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ఊరేగించారు. ● డీఎంపురంలో గంగమ్మ జాతరలో భాగంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించి, భక్తులకు దర్శనవసతి కల్పించారు. ● వెదురుకుప్పం మండలం దామరకుప్పంలో గంగమ్మ తిరుణాళ్ల ముగిశాయి. పాతగుంటలో గంగమ్మను ఊరేగించారు.

● గుడిపాల (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లెలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న గంగమ్మ జాతర బుధవారం వసంతాలతో ముగిసింది. అమ్మవారిని పుష్పపల్లకిపై ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించారు. మహిళలు అమ్మవారికి హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

దోమలు కుట్టకుండా చర్యలు


మలాథిన్ స్ప్రే చేయిస్తున్న మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్

వెదురుకుప్పం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): దోమలు వృద్ధి చెందకుండా, కుట్టకుండా ముందస్తు చర్యలు చేపట్టామని పుత్తూరు మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ మోహన్‌బాబు తెలిపారు. బుధవారం కార్వేటినగరం మండలంలోని కత్తెరపల్లె, కార్వేటినగరం ప్రాంతాల్లో ఉన్న హాస్టళ్లలో మలాథిన్ స్ప్రే చేయించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ త్యాగు, ఎంహెల్‌హెచ్‌పీ కవిత, హెల్త్ అసిస్టెంట్ అంబరీష్‌రాజు, రామ్మోహన్, ఏఎన్ఎం శిరీష, సుమతి ఉద్యోగులు పాల్గొన్నారు.

వేరుశనగ విత్తనాల పంపిణీ

వెదురుకుప్పం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం బ్రాహ్మణపల్లి రైతు సేవా కేంద్రం వద్ద బుధవారం రాయితీ వేరుశనగ విత్తనాలను వ్యవసాయ శాఖ ఉద్యోగులు పంపిణీ చేశారు. పలువురు రైతులు అక్కడికి చేరుకుని వేరుశనగ విత్తనాలను తీసుకెళ్లారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

పాలసముద్రం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ చిన్నరెడ్డెప్ప పేర్కొన్నారు. బుధవారం రాత్రి బలిజకండ్రిగలో పల్లెనిద్ర కార్యాక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని శ్రీకృష్ణ భజన మందిరం వద్ద ప్రజలతో సమావేశమై సైబర్ క్రైమ్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎలాంటి గొడవలకు తావు లేకుండా ప్రశాంతంగా జీవించాలన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అర్జున తపస్సు


చెంచుగుడిలో తపస్మాన్ అధిరోహిస్తున్న అర్జున వేషధారి

వెదురుకుప్పం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం చెంచుగుడి మహాభారత ఉత్సవాలను పురస్కరించుకుని బుధవారం ఆలయ ఆవరణంలో అర్జున తపస్సు కార్యక్రమం వైభోవోపేతంగా జరిగింది. మధ్యాహ్నం ఆలయ ఆవరణంలో అర్జున వేషధారి తపస్మాన్ అధిరోహించే కార్యక్రమాన్ని నిర్వహించారు. తపస్మాన్‌కి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించిన తర్వాత ఆ ఘట్టాన్ని పూర్తి చేశారు. రెంటాలచేను గ్రామానికి చెందిన పూల వెంకటరామిరెడ్డి, పూల యశ్వంత్‌రెడ్డి కుటుంబీకులు ఉభయదారులుగా వ్యవహరించారు. రాత్రి రెంటాలచేనుకు చెందిన బండి భరత్‌రెడ్డి కుటుంబీకుల వితరణతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్తలు పూల పట్టాభిరామిరెడ్డి, పూల వెంకటరామిరెడ్డి పర్యవేక్షించారు. ● కార్వేటినగరం మండలం కొల్లాగుంట వద్ద అర్జున తపస్సు కార్యక్రమం జరిగింది. బట్టువారిపల్లికి చెందిన కనకదుర్గా కుటుంబీకులు ఉభయదారులుగా వ్యవహరించారు. కొల్లాగుంటకు చెందిన డాక్టర్ మునికుమార్, జ్యోతి దంపతుల వితరణతో అన్నదానం చేశారు. ● వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లంలో అర్జున వేషధారి తపస్మాన్‌ను అధిరోహించి పాశుపతాస్త్రం దక్కించుకునే నాటకాన్ని ప్రదర్శించారు.

● శ్రీరంగరాజపురం (ఆంధ్రజ్యోతి): మండలం కేంద్రంలోని ద్రౌపదీ సమేత ధర్మరాజుల మహాభారత బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం అర్జున తపస్సు ఘట్టం వైభవంగా జరిగింది. ఉదయం ధర్మరాజుల మూల విరాట్‌కు అర్చకులు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అర్జున పాత్రధారి తపస్సుమానును ఒక్కో మెట్టు ఎక్కుతూ ఒక్కో పద్యం పాడుతూ ఫలపుష్పాలను, విభూది, నిమ్మకాయలను అన్ని వైపులా వెదజల్లాడు. వీటిని దక్కించుకోవడానికి మహిళలు పోటీపడ్డారు. ఆ తరువాత వారు తపస్మాను ఎదుట వరపడ్డారు. ఆలయ ధర్మకర్త వేణు నాయుడు, గంధమనేని రాజశేఖర్ నాయుడు, నారాయణస్వామి నాయుడు, సుబ్రమణ్యం నాయుడు, ఎత్తి రాజులు నాయుడు, కేశవులు నాయుడు, ఆంజనేయులు నాయుడు, మాధవ నాయుడు, రమేష్ నాయుడు, కుప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు 'సుపరిపాలన తొలి అడుగు'

గంగాధరనెల్లూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నేటితో ఏడాదికాలం పూర్తయినందున గురువారం ఉదయం 10 గంటలకు సుపరిపాలన తొలి అడుగు వేడుకలను నిర్వహించనున్నట్లు మండల టీడీపీ అధ్యక్షుడు స్వామిదాస్, ప్రధానకార్యదర్శి జ్యోతిరెడ్డి తెలిపారు. ఈ వేడుకలకు టీడీపీ, జనసేన, బీజేపీకి చెందిన నేతలు, కార్యకర్తలు తరలిరావాలని వారు కోరారు.

వైభవంగా పౌర్ణమి వేడుకలు

పాలసముద్రం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచపాళ్యంలో వెలసిన బాలగురునాథీశ్వర ఆలయంలో బుధవారం పౌర్ణమి వేడుకలను గ్రామస్థులు వైభవంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో అర్చకులు రుద్రహోమాన్ని నిర్వహించారు. రెండు కలశాలు ఏర్పాటు చేసి హోమం అనంతరం గ్రామ దేవతకు, బాలగురునాథీశ్వరస్వామి మూల విరాట్‌కు ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

● విజయపురం(ఆంధ్రజ్యోతి): మండలంలోని జగన్నాథపురం శ్రీరామనామ క్షేత్రంలో బుధవారం పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీతారాముల వారిని అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

● బంగారుపాళ్యం (ఆంధ్రజ్యోతి): పౌర్ణమి సందర్భంగా బుధవారం మండలంలోని జంబువారిపల్లె పంచాయతీ మాధవనగర్ బ్రహ్మానంద ఆశ్రమంలో నిర్వాహకులు కేశవనంద స్వామి ఆధ్వర్యంలో సత్యనారాయణ పూజ, వ్రతకల్ప కార్యక్రమం జరిగింది. పరిసర గ్రామాల భక్తులు పాల్గొనగా, అన్నదానం చేశారు.

వైభవంగా మాతమ్మ తిరుణాళ్ల

వెదురుకుప్పం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం తూర్పు అరుంధతీవాడలో మాతమ్మ తిరుణాళ్ల వైభవంగా జరిగింది. బుధవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను చేశారు. మధ్యాహ్నం గెరిగెను ఊరేగింపు చేశారు.